ANN తెలుగు

Follow: @ANNTELUGU

11-03-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 99 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ప్రధాని మోదీతో ఈటల రాజేందర్ కుటుంబం

### ఆప్యాయంగా పలకరించిన ప్రధాని

మహా: ప్రధాని నరేంద్ర మోడీతో తెలంగాణ బీజేపీ కీలక నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కుటుంబసమేతంగా వెళ్లి కలిశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఈటల పేరు ఖరారు అయిందన్న ప్రచారం చాలాకాలంగా ఉంది. అందుకే అధిష్టానం పెద్దల ఆశీర్వాదాలకు వెళ్లారని ఆయన అభిమానులు చెబుతున్నారు. ఈటల రాజేందర్ కుటుంబసభ్యులతో మోదీ ఆప్యాయంగా మాట్లాడారు. ఈటల విజయాల్లో ఆయన భార్య జమునతో పాటు కుటుంబసభ్యుల పాత్ర గణనీయమైనది. తెలంగాణ ఉద్యమంలో ఈటల ఎంతో కొల్పోయారు. రాష్ట్రమంత్రిగానూ తన సమర్థత చాటారు. గతంలో ధర్మపురి అర్వింద్ కూడా కుటుంబంతో సహా పలుమార్లు మోదీని కలిశారు. కుటుంబంతో కలయికకు రాజకీయ ప్రాధాన్యం ఉండదని బిజెపి నేతలు అంటున్నారు. ఈటల రాజేందర్ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యమున్న నాయకుడని పార్టీ వర్గాలు అంటున్నాయి. బిజెపి అధ్యక్ష పదవి కోసం ధర్మపురి అర్వింద్, మాధవనేని రఘునందన్ రావుతో పాటు పలువురు నాయకులు ప్రయత్నం చేయగా.. అధిష్టానం మాత్రం ఈటలవైపే మొగ్గు చూపిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈటలకు ఇస్తే బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని బీజేపీ అగ్రనాయకులు భావిస్తున్నట్లు సమాచారం.

**టాప్ న్యూస్**

## సౌందర్య మరణం వెనుక కుట్ర?



- మంచు మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు
- ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- హెలికాప్టర్ ప్రమాదం కాదు - హత్య అంటూ తీవ్ర ఆరోపణలు
- జల్‌పల్లిలోని గెస్ట్‌హౌజ్ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్

03

## బీహార్‌లో భారీ దోపిడి



- తనిష్క్ షో రూంలో రూ.25 కోట్ల విలువైన ఆభరణాలు చోరీ
- సిబ్బందికి పాయింట్ బ్లాంక్‌లో గన్
- పట్టపగలే రెచ్చిపోయిన దొంగలు

05

## మళ్లీ పుష్ప పంచాయితీ




- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చిత్రాల లాభాలను కళాకారుల సంక్షేమానికి కేటాయించాలని హైకోర్టులో పిటిషన్
- హైకోర్టులో విచారణ రెండు వారాలకు వాయిదా

02



## సినిమాల్లోకి జగ్గన్న ఎంట్రీ

- పాలిటిక్స్ టు టాలీవుడ్
- తగ్గేదేలేదంటూ పోస్టర్ విడుదల

వివరాలు 2లో




## ఇంటర్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంపై బోర్డు క్లారిటీ

- సోమవారం జరిగిన పరీక్షలో క్వశ్చన్ పేపర్‌లో చాట్ ఆధారంగా ఇచ్చిన 7 ప్రశ్నకు ప్రింట్ లోపం
- ఆ ప్రశ్న ప్రయత్నించిన వారందరికీ ఫుల్ మార్క్స్

వివరాలు 3లో



## శ్రీ చైతన్య విద్యాసంస్థలపై ఐటీ దాడులు

- వెలుగులోకి విస్తుపోయే అంశాలు
- భారీగా నగదు స్వాధీనం
- రెండు కోట్ల నగదు లభ్యం

వివరాలు 3లో



## ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

- పాత ప్రాజెక్టుల నిర్వహణ పై దృష్టి పెట్టండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

వివరాలు 3లో



# హరీష్ బీజేపీకి లొంగిపోయారు

### ఆయన బీఆర్ఎస్ ఓట్లను నిలబడి బీజేపీకి వేయించారు

### కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఓటమిలో హరీష్ హస్తం

### కేటీఆర్ గురించి మాట్లాడటం వేస్ట్

జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి రాష్ట్రంలో కేసీఆర్ ఒక్కరే

39 సార్లు కాదు.. 99 సార్లు కేంద్రాన్ని అభ్యర్థిస్తా.. నిధులివ్వకుంటే ఢిల్లీలో ధర్నా చేస్తా

కిషన్ రెడ్డితో నిధులపై చర్చకు సిద్ధం..సీఎల్పీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

కాంగ్రెస్, సీపీఐ ఎమ్మెల్సీల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి

**మహా :** సీఎం రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు పూర్తిగా బీజేపీకి లొంగిపోయారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో దగ్గరుండి మరీ బీజేపీకి ఓట్లు వేయించారన్నారు. . అందుకే కాంగ్రెస్ ఓడిపోయిందంటూ హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం సీఎల్పీలో జరిగిన మీడియా చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్, కేటీఆర్ మీద తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవటంపై సీఎం స్పందించారు. క్రిమినల్స్ ఎప్పుడూ కేసులకు భయపడరని, కేసులకు భయపడితే అసలు నేరాలే చేయరంటూ కేటీఆర్ గురించి మాట్లాడటమే వేస్ట్ అని రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. ఇటీవల జరిగిన రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ స్థానమైన కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటును కోల్పోవడం వెనుక హరీష్ రావు హస్త ముందన్నారు.

మిగతా 3లో

### 39 సార్లు కాదు.. 99 సార్లు ఢిల్లీకి వెళ్తా

తన ఢిల్లీ పర్యటనలపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి రాష్ట్రానికి కావల్సినవి తెచ్చుకుంటున్నానని అన్నారు. రాష్ట్రానికి కావాల్సిన అనేక అంశాలను క్లియర్ చేసుకొని వచ్చానని, ఆ విషయాలన్నీ తెలిసినా తెలియనట్లు నటిస్తూ లేనిపోని ఆరోపణలను చేసి ప్రజలను తికమకలోకి నెట్టేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు.33 సార్లు కాదు 99 సార్లు ఢిల్లీకి వెళ్తా వీళ్ళకెందుకు కుళ్ళు అని నిలదీశారు. కుల గణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇచ్చాయని, ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు.

## ఆ ఐదుగురు.. ఇక కౌన్సిల్‌కు

### అందరూ తొలిసారే

- కోలాహలంగా అసెంబ్లీ ఆవరణలో నామినేషన్లు
- కార్యక్రమానికి సీఎం రేవంత్, భట్టి, మహేష్ గౌడ్, మంత్రులు, కేటీఆర్, సీపీఐ రాజా, నారాయణ

03

## బీజేపీ బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం

### చీకటి ఒప్పందం తెలిసే ఆ పార్టీ నుండి బయటకువచ్చా

కాంగ్రెస్ హైకమాండ్.. ఏ బాధ్యత అప్పగించినా పనిచేస్తా

నేను నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారిణి

బీసీ మహిళా నేతగా.. నా అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించింది

ఎమ్మెల్సీగా నామినేషన్ అనంతరం మీడియాతో విజయశాంతి



**హైదరాబాద్, మహా:** ముందుచూపుతో రాష్ట్ర ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతి అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. "నేను గతంలోనూ కాంగ్రెస్‌లో పనిచేశాను. కానీ, ఏనాడూ ఇది కావాలని పార్టీని అడగలేదు. పార్టీ హైకమాండ్ నాకు అవకాశం ఇచ్చినా.. నాకు వద్దు.. నేను ముందు పనిచేస్తా అని అన్నాను.

మిగతా 2లో

## 16 తర్వాత నాకు మళ్ళీ నోటీసులొస్తాయ్

### రేవంత్ రెడ్డి ఇన్ సైడర్ ట్రేడింగ్.. ఈసారి సభకు కేసీఆర్

చిట్ చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, మహా:** మాజీ సీఎం కేసీఆర్ ఈసారి అసెంబ్లీకి వస్తారని , గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో దాసోజు శ్రవణ్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

మిగతా 5లో





## తెలంగాణ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ ఒక ప్రధాన ఘట్టం

- టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం
- మిలియన్ మార్చ్ కు 14 ఏళ్ళు
- గన్ పార్క్ వద్ద నాటి జెఏసి నేతల నివాళులు


**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఉద్యమ యాదిలో... మిలియన్ మార్చ్ డే సందర్భంగా గన్ పార్క్ వద్ద అమర వీరుల స్తూపానికి శాసనమండలి సభ్యులు, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాటి జేఏసీ నాయకులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిగతా 5లో

## నల్గొండలో ప్రణయ్ హత్య కేసు

- ఆరేళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు.. ఒకరికి మరణ శిక్ష
- మిగిలిన వారికి జీవిత ఖైదు విధించిన కోర్టు
- తీర్పు గుణపాఠం కావాలన్న ప్రణయ్ తండ్రి

02



## గ్రూప్-1 ఫలితాలు విడుదల

### ప్రొవిజనల్ మార్కులు వెల్లడి

వెబ్‌సైట్‌లో మార్కులు చూసుకునే అవకాశం

రీకౌంటింగ్‌కు ఈ నెల 24 వరకు అవకాశం

రీ కౌంటింగ్ తర్వాత జనరల్ ర్యాంకింగ్ జాబిత

02

## హైదరాబాద్‌లో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య

వివరాలు 5లో

## గ్రూప్-1 ఫలితాలు విడుదల
### ప్రొవిజనల్ మార్కులు వెల్లడి




**మహా :** గ్రూప్1 పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. గ్రూప్1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ప్రొవిజనల్ మార్కులను టీజీపీఎస్సీ విడుదల చేసింది. టీజీపీఎస్సీ కమిషన్ అధికారిక వెబ్‌సైట్లో అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు ఈనెల 24 వరకు అవకాశం ఇచ్చిన టీజీపీఎస్సీ రూ. 1000 చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. రీకౌంటింగ్ తర్వాత జనరల్ ర్యాంకింగ్ జాబితా ప్రకటించనుంది. గతేడాది అక్టోబర్ చివరి వారంలో గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు పూర్తి అయ్యాయి. గ్రూప్ 1 పరీక్షలు 21,093 మంది అభ్యర్థులు రాశారు. 563 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గ్రూప్స్ ఫలితాల వెల్లడికి రూపొందించిన షెడ్యూల్‌ను ఈ నెల 7న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మార్చి 10 నుంచి 18 మధ్య గ్రూప్1, 2, 3 ఫలితాలను వెల్లడించనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 10న గ్రూప్1 ఫలితాలు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం మార్చి 10న గ్రూప్1 ఫలితాల విడుదల, అదే రోజు అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల వివరాలనూ టీజీపీఎస్సీ వెల్లడించింది. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. ఈ నెల 11న గ్రూప్2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించనుంది. మార్చి 14న గ్రూప్3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను కమిషన్ వెల్లడించనుంది. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేయనుంది. గ్రూప్1 పోస్టులపై తప్పుడు వార్తలను టీజీపీఎస్సీ ఖండించింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఈ నెల 5న టీజీపీఎస్సీ ఫిర్యాదు చేసింది. తప్పుడు వార్తలపై పోలీసులకు టీజీపీఎస్సీ అధికారులు ఫిర్యాదు చేశారు. గ్రూప్1 మార్కుల జాబితాను వెబ్ సైట్‌లో పెడతామని టీజీపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు ఉంచుతామని, గ్రూప్1 నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఎలాంటి తప్పులు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని టీజీపీఎస్సీ విజ్ఞప్తి చేసింది.

# నల్గొండలో ప్రణయ్ హత్య కేసు
### ఆరేళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు
**ఒకరికి మరణ శిక్ష.. మిగిలిన వారికి జీవిత ఖైదు విధించిన కోర్టు**
**తీర్పు గుణపాఠం కావాలన్న ప్రణయ్ తండ్రి**



**మహా :** ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ 2 అయిన సుభాష్ శర్మకు న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. మిగిలిన నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేసింది. తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు అనే వ్యక్తి 2018 సెప్టెంబర్ 14న సుపారీ గ్యాంగ్‌తో యువకుడు ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ పూర్తి చేసి, 8 మందిని నిందితులుగా పేర్కొంటూ న్యాయస్థానంలో 2019లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 6 ఏళ్లకు పైగా కోర్టులో విచారణ సాగగా, ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా సోమవారం ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ప్రణయ్ హత్య కేసులో ఏ 1 గా ఉన్న నిందితుడు మారుతీరావు 2020లో హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కేసులో ఏ 2 సుభాష్ కుమార్ శర్మ, ఏ 3 అస్గర్ అలీ, ఏ 4 బారీ, ఏ 5 కరీం, ఏ 6 శ్రవణ్‌కుమార్, ఏ 7 శివ, ఏ 8 నిజాంలు మిగిలిన నిందితులుగా ఉన్నారు. వీరిలో సుభాష్ శర్మకు బెయిల్ రాకపోవడంతో జైల్లోనే ఉండగా, అస్గర్ అలీ వేరే కేసులో జైలులో ఉన్నాడు. మిగిలిన వారందరూ బెయిల్ మీద బయటకు వచ్చారు. అనారోగ్య సమస్యలు ఉన్నాయని, తమపై ఆధారపడిన తల్లిదండ్రులు, పిల్లల కోసం శిక్ష తగ్గించాలని నిందితులు న్యాయస్థానాన్ని వేడుకున్నారు. తనకు ఈ కేసుతో సంబంధం లేదని అమృత బాబాయ్ శ్రవణ్ కుమార్ అన్నారు. ముగ్గురు పెళ్లికాని పిల్లలు ఉన్నందున దయచూపాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

### జరిగింది ఇదీ
**మారుతీరావు కుమార్తె అమృతను ప్రణయ్ అనే యువకుడు 2018 జనవరిలో హైదరాబాద్‌లో ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వీరి వివాహంతో రెండు కుటుంబాల మధ్య విబేధాలు వచ్చాయి. దీంతో ఇరు కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలోనే తాను ప్రణయ్‌తోనే ఉంటానని పోలీసుల సమక్షంలో అమృత తేల్చిచెప్పింది. 2018 సెప్టెంబరు 14న వైద్య పరీక్షల కోసం భర్త ప్రణయ్, అత్త ప్రేమలతతో కలిసి అమృత ఆస్పత్రికి వెళ్లింది. హాస్పిటల్ నుంచి తిరిగి వెళ్తుండగా ప్రణయ్‌ను దుండగులు కత్తితో నరికారు. దీంతో ఘటనా స్థలంలోనే అతడు ప్రాణాలు కోల్పోయాడు. అప్పటికే అమృత గర్భవతి. ప్రణయ్ హత్య అనంతరం అమృత కుమారుడికి జన్మనిచ్చింది. ప్రస్తుతం అమృత, ఆమె కుమారుడు ప్రణయ్ కుటుంబంతోనే ఉంటున్నారు.**

ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు నేపథ్యంలో ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి స్పందించారు. తన కుమారుని పరువు హత్యపై నల్గొండలో ఈరోజు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో నేరస్తులకు కనువిప్పు కలగాలన్నారు. న్యాయం కోసం జస్టిస్ ఫర్ ప్రణయ్ అంటూ పోరాటం చేశామని అన్నారు. ఈ హత్య తర్వాత చాలా పరువు హత్యలు జరిగాయని వారందరికీ ఈ తీర్పు గుణపాఠం కలగాలని బాలస్వామి అన్నారు. 'మేము ప్రణయ్ హత్య ద్వారా చాలా కోల్పోయాం. అమృతకు భర్త లేడు. నాకు కొడుకు లేడు. నా మనువడికి నాన్న లేడు' అని ప్రణయ్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష పడిందని ఈ క్రమంలో వారి కుటుంబాలు కూడా బాధపడుతుంటాయని, తనకు ఎవరిపై కోపం లేదన్నారు. వారు కూడా ఈ రకమైన హత్యలకు పాల్పడడం విచారకరమని ప్రణయ్ తండ్రి అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏదైనా ఉంటే చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ తీర్పుతో పరువు హత్యలు ఆగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రణయ్ ది పరువు హత్య కాదు... కాంట్రాక్టు హత్య**
**ప్రస్తుత హైడ్రా కమిషనర్, అప్పటి ఎస్పీ రంగనాథ్**

ప్రణయ్ హత్య కేసుపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన తీర్పుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన నల్గొండ జిల్లా ఎస్పీగా ఉన్న సమయంలో నాలుగు రోజుల వ్యవధిలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ప్రణయ్ హత్యకేసులో సంచలన విషయాలు చెప్పి అది పరువుహత్య కాదన్న హైడ్రా కమిషనర్ ప్రణయ్ హత్య కేసులో ఏం చేశారో చెప్పిన రంగనాథ్ పూర్తి టెక్నాలజీ ఆధారంగా ఈ కేసును చేదించినట్టు, దాదాపు 8 నెలల పాటు ప్రణయ్ హత్య కేసు దర్యాప్తు కొనసాగిందన్నారు. కాల్ డేటా మొదలుకొని ప్రతి అంశంలోను జాగ్రత్త వహించినట్టుగా రంగనాథ్ తెలిపారు. తాము కేసు దర్యాప్తులో ఎక్కడ వెనక్కి తగ్గలేదని, దర్యాప్తులో చాలా జాగ్రత్తగా వ్యవహరించి ముందుకు వెళ్లామన్నారు. కోట్ల రూపాయల సుఫారీ తో కూడుకొని ఉన్న వ్యవహారం కావడంతో ప్రతి విషయాన్ని జాగ్రత్తగా ఫైల్ చేసినట్టుగా తెలిపారు. చార్జి షీట్ కు ముందే ముందు ముందు ఏమేమి జరుగుతుంది అన్నదాని పైన గంటలు తరబడి చర్చలు జరిగాయని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు వస్తాయనేది దృష్టిలో పెట్టుకొని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లామని తెలిపారు. అప్పటి డీజీ మహేందర్ రెడ్డితో పాటు ఇతర అధికారుల సహకారం తమకు ఉందని పేర్కొన్నారు. ఇక ఈ హత్యకేసులో సాక్షులుగా ఉన్నవారు వారేం చెప్పారో అదే విషయానికి చివరి వరకు కట్టుబడి ఉన్నారని రంగనాథ్ వెల్లడించారు. అది పరువు హత్య కాదు, కాంట్రాక్ట్ మర్డర్ అని రంగనాథ్ పేర్కొన్నారు. అమృత, ప్రణయ్ తల్లి ప్రేమలత ఎటువంటి ప్రలోభాలకు కూడా లొంగలేదని చాలా స్ట్రాంగ్ గా నిలబడ్డారని పేర్కొన్నారు. అయితే 2018 సెప్టెంబర్ 14వ తేదీన జరిగిన ఈ హత్య పరువు హత్యగా ప్రచారం జరిగిందని అయితే తాము పోలీసులుగా ఆ విషయాన్ని అంగీకరించలేమన్నారు. అది పరువు హత్య కాదన్నారు. ఒక కులానికి ఎక్కువ పరువు మరో కులానికి తక్కువ పరువు ఉండదని అది కాంట్రాక్టు మర్డర్ అని రంగనాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న వారంతా తీవ్ర అభియోగాలు ఎదుర్కొన్న వారని రంగనాథ్ తెలిపారు. అన్ని ఆధారాలతో 1600 పేజీల చార్జ్ షీట్ వేశామని ఎవరెన్ని విమర్శలు చేసిన పట్టించుకోకుండా పోలీసులు ముందుకు వెళ్లి ఈ కేసును చేదించినట్టుగా రంగనాథ్ తెలిపారు.




## కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ

**ఒట్టావా:** కెనడాలో తొమ్మిదేళ్ల జస్టిన్ ట్రూడో పాలనకు తెరపడింది. ఆ దేశ నూతన ప్రధానిగా మార్క్ కార్నీ ఖరారు అయ్యారు. తాజాగా జరిగిన సమావేశంలో తమ కొత్త సారథిగా అధికార లిబరల్ పార్టీ కార్నీని ఎన్నుకుంది. ఏనాడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని, కేబినెట్‌లో పనిచేయని ఆయన.. కెనడా 24వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. తీవ్ర ప్రజా వ్యతిరేకతతో జస్టిన్ ట్రూడో ఈ జనవరిలో ప్రధాని పదవి నుంచి వైదొలగనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లిబరల్ పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. అయితే కొత్త నేత ఎన్నిక దాకా జస్టిన్ ఆ పదవిలో కొనసాగారు. ఇక కొత్త ప్రధానిగా బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ మార్క్ కార్నీ ఎన్నికయ్యారు . తాజాగా జరిగిన ఓటింగ్‌లో లిబరల్ పార్టీ సభ్యులు మొత్తం 1,50,000 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్నేకు 131,674 ఓట్లు పోలవ్వగా.. క్రిస్టియా ఫ్రీలాండ్ 11,134, కరినా గౌల్డ్‌కు 4,785, ఫ్రాంక్ బేలిస్‌కు 4,038 ఓట్లు వచ్చాయి. అంటే కార్నేకు వచ్చిన ఓట్లు 86 శాతమన్నమాట. ఆర్థిక మేధావిగా పేరున్న మార్క్ కార్నీ సరిగ్గా డొనాల్డ్ ట్రంప్ సుంకాల ముప్పు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న వేళలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తుండడం గమనార్హం.


**కార్నీ.. బ్యాక్‌గ్రౌండ్ ఇదే**

- మార్క్ కార్నీ 1965లో ఫోర్ట్ స్మిత్‌లో జన్మించారు. హార్వర్డ్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. గోల్డ్‌మన్ శాక్స్‌లో 13 ఏళ్లు పనిచేసిన ఆయన.. 2003లో బ్యాంక్ ఆఫ్ కెనడా డిప్యూటీ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 2004లో ఆ బాధ్యతల నుంచి వైదొలగి.. కెనడా ఆర్థిక మంత్రి పదవిని చేపట్టారు.
- 2008 ఫిబ్రవరి 1న సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా నియమితులయ్యారు. సరిగ్గా అదే సమయంలో కెనడా ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడుతోంది. ఆ టైంలో ఆయన అనూహ్యంగా.. వడ్డీ రేట్లను సున్నాకు తగ్గించారు.

## సినిమాల్లోకి జగ్గన్న ఎంట్రీ
### పాలిటిక్స్ టు టాలీవుడ్.. తగ్గేదేలేదంటూ పోస్టర్ విడుదల





**మహా :** జగ్గారెడ్డి తెలంగాణ కాంగ్రెస్ లో ఈయన ఒక ఫైర్ బ్రాండ్. జగ్గారెడ్డి ఒక విలక్షణమైన రాజకీయ నాయకుడు. ఎప్పుడూ తన నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవలందించే జగ్గారెడ్డి అప్పుడప్పుడు పార్టీలో కీలక నేతలపైన సంచలన వ్యాఖ్యలు చేస్తూ సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉంటాడు. ఇక ప్రత్యర్థి పార్టీలను టార్గెట్ చేస్తూనే సొంత పార్టీ నేతలపై కూడా విరుచుకుపడతారు. గత ఎన్నికలలో ఆయన ఓటమి పాలైన తర్వాత రాజకీయంగా కాస్త సైలెంటైన జగ్గారెడ్డి ప్రస్తుతం సినిమాలు మీద ఫోకస్ చేస్తున్నారు. ఇక త్వరలో జగ్గారెడ్డి లీడ్ రోల్ తో టాలీవుడ్ లో ఒక సినిమా రాబోతుందని ఆయనే స్వయంగా వెల్లడించారు. తాను సినిమాల్లోకి రాబోతున్నానని చెప్పిన జగ్గారెడ్డి ఒక ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నానని చెప్పారు. ఈ ఉగాదికి కథ విని ఆ తర్వాత షూటింగ్ లో పాల్గొంటానని ఆయన స్పష్టం చేశారు. ఇక రాజకీయాల నుంచి కాస్త విశ్రాంతి తీసుకుని ఏ వార్ ఆఫ్ లవ్ పేరుతో ఒక ప్రేమకథా చిత్రంలో లీడ్ రోల్ లో ఆయన నటించబోతున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్ ను కూడా జగ్గారెడ్డి విడుదల చేశారు. ఇది తెలుగు మరియు హిందీ భాషలలో వస్తుందని, ఈ ఉగాదికి కథ విని వచ్చే ఉగాది నాటికి సినిమా విడుదల చేస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇక జగ్గారెడ్డి నిజజీవితం ఆధారంగా ప్రస్తుతం సినిమా వస్తుందని ఆయనే నటుడిగా ఆ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాలలో ఆసక్తికర చర్చగా మారింది. ప్రేమికుల ప్రేమను కాపాడే క్యారెక్టర్ గా జగ్గారెడ్డి క్యారెక్టర్ ఆ సినిమాలో ఉండబోతుందని ఇది పాన్ ఇండియా చిత్రంగా ఉంటుందని దేశవ్యాప్తంగా రిలీజ్ కూడా చేస్తామని చెబుతున్నారు. సినిమాలో నటిస్తానని పేర్కొన్న జగ్గారెడ్డి పార్టీ అధిష్టానం టీపీసీసీ, సీఎం రేవంత్ రెడ్డి అనుమతితోనే తాను సినిమాలో నటిస్తున్నానని సినిమాలో ఇంటర్వెల్ దగ్గర మొదలయ్యే తన పాత్ర సినిమా ఎండింగ్ వరకు ఉంటుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మరి జగ్గారెడ్డి రాజకీయాల్లో సెన్సేషన్ క్రియేట్ చేసినట్టే సినిమాలో కూడా క్రియేట్ చేస్తారా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



## శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ
### మాదాపూర్ ఆఫీస్ తో సహా ప్రధాన కార్యాలయాల్లో సోదాలు

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన విద్యా సంస్థ శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యాలయాల్లో ఆదాయం పన్నుశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. విద్యా సంస్థలకు వస్తున్న ఆదాయం, ఆ ఆదాయంపై చెల్లిస్తున్న పన్నులు, విద్యా సంస్థల నిర్వహణకు వ్యయంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యం భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆదాయం పన్నుశాఖ పరిశీలనలో తేలింది. దీంతో హైదరాబాద్, విజయవాడ సహా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గల శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యాలయాల్లో సోమవారం ఉదయం నుంచి తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల శ్రీ చైతన్య విద్యా సంస్థల కార్పొరేట్ కార్యాలయం సహా అన్ని కళాశాలల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి.

## అప్పుడు తులం బంగారం అన్నారు ఇప్పుడు ఊరూరా బెల్టు షాపులు తెరిచారు
### మండిపడ్డ బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు శిల్పారెడ్డి



**మహా :** కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి 15 నెలల్లో ఎంత మందిని కోటీశ్వరులను చేశారో చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని మహిళలు భావిస్తున్నారన్నారు. మహిళలకు నెలనెలా ఇస్తామన్న రూ. 2500 హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. బీజేపీ మాత్రమే మహిళా సాధికారతకు కట్టుబడి ఉందన్నారు. మహిళలను గౌరవించి వారికి ఉన్నత పదవులను ఇవ్వడంతో పాటు వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నది కేవలం బీజేపీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలు అంటే ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలే తప్ప మిగతా వారు కారన్నారు. రేవంత్ రెడ్డిని అన్నగా భావిస్తే మహిళలకు కడుపుకోతే మిగులుతుందని వ్యాఖ్యానించారు. సోనియాగాంధీకి రేవంత్ రెడ్డి బానిసగా మారారని అన్నారు. ఎన్నికలకు ముందు మహిళలను మహరాణులను చేసతామని తులం బంగారం ఇస్తామని చెప్పారని, ఇప్పుడు థులం బంగారం ఇవ్వకపోగా ఊరూరా బెల్టుషాపులు తెరిచి మహిళల ఉసురు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బెల్టు షాపుల పేరుతో అనేక మంది తాలి బొట్లు తెంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామన్న ముఖ్యమంత్రి గడచిన 15 మాసాల కాలంలో ఒక్క మహిళనైనా పారిశ్రామిక వేత్తను చేశారా అని నిలదీశారు. 600 బస్సులు ఇస్తామని చెప్పి కేవలం 20బస్సులే ఇచ్చారన్నారు..

## ముగియని పుష్ప పంచాయితీ

- **లాభాలు జానపద కళాకారుల పింఛన్‌కు కేటాయించాలంటూ పిల్**
- **విచారణను రెండు వారాలు వాయిదా వేసిన హైకోర్టు**



**మహా :** పుష్ప 2 కు వచ్చిన లాభాలను చిన్న చిత్రాలకు, బడ్జెట్ రాయితీకి వినియోగించాలని, జానపద కళాకారుల పింఛన్ కోసం కేటాయించాలని తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది నరసింహారావు ఈ పిల్ దాఖలు చేశారు. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు వల్ల పుష్ప2 చిత్రానికి భారీగా ఆదాయం వచ్చిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హోంశాఖ ప్రత్యేక ఉత్తర్వులిచ్చి మరీ బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతించిందని తెలిపారు. బెనిఫిట్ షో, టికెట్ ధరలు పెంపునకు అనుమతివ్వడానికి గల కారణాలేంటో చెప్పలేదని కోర్టుకు వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చిత్రాల లాభాలను కళాకారుల సంక్షేమానికి కేటాయించాలని కోరారు. ఇప్పటికే బెనిఫిట్ షోలు, టికెట్ల వసూలు ముగిసింది కదా అని సీజే ప్రశ్నించగా వాటి వల్ల వచ్చి న లాభం గురించే పిటిషన్ దాఖలు చేశామని న్యాయవాది తెలిపారు. అందుకు తగిన విధంగా సుప్రీంకోర్టు తీర్పు కాపీని సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో ఎర
### సైబర్ నేరగాళ్ల వలలో థాయ్ లాండ్ లో బందీగా మారిన యువత
### కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యం.. 540 మంది బందీలకు విముక్తి
### ప్రత్యేక విమానంలో భారత్ కు రాక



**మహా:** ఉద్యోగాల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్ లో బందీలుగా మారి బలవంతంగా సైబర్ వెట్టిచాకిరికి గురవుతున్న వందలాది మంది భారతీయ యువతకు విముక్తి లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జోక్యంతో వీరందరినీ స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. మొత్తం 540 మంది బందీలను గుర్తించగా వీరిలో తెలంగాణ, ఏపీకి చెందిన 42 మందిని గుర్తించారు. వీరందరినీ 270 మంది చొప్పున రెండు విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత వీరిని థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణానికి తరలించిన అక్కడి అధికారులు అక్కడి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తరలిస్తున్నారు. సోమవారం 270 మందితో కూడిన తొలి విమానం థాయ్‌లాండ్‌లోని మై సోట్ నుంచి ఢిల్లీకి బయల్దేరింది. మంగళవారం మరో 270 మందితో రెండో విమానం ఇండియాకు రానుంది. ప్రస్తుతం వీరంతా మయన్మార్‌లోని మేవాడీ జిల్లాలో ఆర్మీ పరిరక్షణలో ఉన్నారు. వీరందరినీ మంగళవారం ఉదయం మయన్మార్ ఆర్మీ ట్రక్కుల్లో తొలుత థాయ్‌లాండ్‌లోని మైసోట్‌కు, అక్కడ ప్రత్యేక ఆర్మీ విమానంలో ఇండియాకు తీసుకురానున్నారు. వాస్తవానికి వీరంతా విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు వెళ్లి అక్కడ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగా వీరందరికీ ఉద్యోగాలిప్పిస్తామని స్థానిక ఏజెంట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు ఆయా యువతకు ఆశ చూపారు. వారికి ఉద్యోగాలు ఖరారయ్యాయని నమ్మబలికిన ఏజెంట్లు థాయ్‌లాండ్‌తోపాటు పొరుగున్న కంబోడియా, లావోస్, మయన్మార్‌లలో పలు సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో వీరిని విక్రయించారు. అక్కడికి వెళ్లాక వారితో బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నారు. ఒకవేళ సైబర్ నేరాలు చేయకపోతే యువతీ, యువకులకు కరెంటు షాకులిచ్చి హింసిస్తారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు ఇలాగే కొలువు కోసం వెళ్లి బందీగా మారిన విషయం మీడియాలో వచ్చింది. వెంటనే స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వారిని రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భారత విదేశాంగశాఖకు స్వయంగా లేఖ రాశారు. మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్యకార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో మయన్మార్ ప్రభుత్వం తన ఆర్మీని పంపి సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లలో బందీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. అనంతరం బండి సంజయ్ చొరవతో కేంద్రం వారందరినీ స్వదేశానికి రప్పిస్తుండటం గమనార్హం.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో విచారణ
### రాధాకిషన్ ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు.. తీర్పునున వాయిదా వేసిన కోర్టు



**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ముందస్తు బెయిల్ కోరుతూ రాధాకిషన్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును కోర్టు వాయిదా వేసింది. గతంలో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్టలో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌పై ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు వేసిన పిటిషన్‌పైన సుదీర్ఘ వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం వాయిదా వేసింది. చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకిషన్‌రావుతో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు సహా పలువురిపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్ రావు తన వాదనలు వినిపించారు. కానీ ముందస్తు బెయిల్ ఇవ్వొద్దంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ జరపాలని, చాలా ఆధారాలను సేకరించాల్సి ఉంటుందని, కీలక అంశాలు వెలుగులోకి రావాలని ఈ క్రమంలో రాధాకిషన్‌కు బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న కోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు మొదటి ఎఫ్ఐఆర్‌లో జ్యుడిషియల్ రిమాండ్ నుంచి కొద్దిరోజుల క్రితమే రాధాకిషన్ బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో రెండో కేసుకు సంబంధించి తనకు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు.

# హరీష్ బీజేపీకి లొంగిపోయారు

## ఆయన బీఆర్ఎస్ ఓట్లను నిలబడి బీజేపీకి వేయించారు



(మొదటిపేజీ తరువాయి)

హరీష్‌రావు పూర్తిగా బీజేపీకి లొంగిపోయారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో దగ్గరుండి నిలబడి మరీ బీజేపీకి ఓట్లు వేయించారన్నారు. బీఆర్ఎస్ వాళ్లతో సంబంధం ఉండటం వల్లే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్వహించిన అన్నిపార్టీల ఎంపీల సమావేశానికి బీజేపీ రాలేదని సీఎం ఆరోపించారు. బీసీ కులగణనతో సామాజిక న్యాయం జరిగిందని, తాము చేసిన కుల గణన వల్లే ఇవాళ అన్నీ పార్టీలు బీసీలకు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చాయని రేవంత్ చెప్పుకొచ్చారు.

### రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు

మరోవైపు రాష్ట్రంలో రైతులు బాధ పడుతున్నారని తెలియగానే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముగ్గురు కలిసి తీన్మార్ డాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని సీఎం దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్ బీసీని పడావు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు వచ్చిందని జనాలను ఆందోళనకు గురిచేస్తున్నారని.. పండిన పంట నివేదిక చూసి మాట్లాడాలని సూచించారు. గతంలో రెండో పంట 35 లక్షల ఎకరాలు వేశారని.. కానీ ఇప్పుడు మొదటిసారి రాష్ట్రంలో 55 లక్షల ఎకరాలలో రైతులు పంటలు వేశారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ చెల్లని రూపాయి అని ఆయన గురించి మాట్లాడటం సమయం వృథా అని అన్నారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని వాళ్ల పిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌ను బండకేసి కొట్టి ఓడించింది తానేనని తెలిపిన రేవంత్ రెడ్డి.. తండ్రి కొడుకులకు బలుపు తప్ప ఏమీ లేదని దుయ్యబట్టారు. డ్రగ్స్ పార్టీల్లో దొరకడం కేటీఆర్ స్టేచరా అని ప్రశ్నించారు. కేటీఆర్ అన్నట్లు నిజంగానే అసెంబ్లీకి వచ్చే స్థాయి కేసీఆర్‌కు లేదని చెప్పుకొచ్చారు. కేటీఆర్ ఓ పిచ్చోడని.. ఏదేదో మాట్లాడతాడంటూ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

### నిరూపిస్తే కిషన్ రెడ్డిని సన్మానిస్తా

రాష్ట్రానికి కిషన్ రెడ్డి ఎక్కువ నిధులు తెచ్చాడన్న అంశంపై స్పందిస్తూ నిరూపిస్తే ఆయనను సన్మానిస్తానని రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి తనతో సహకరిస్తే కేసీఆర్ బాధపడతాడన్న ఉద్దేశ్యంతోనే కిషన్ రెడ్డి సహకరించడం లేదన్నారు. ఆల్ పార్టీ ఎంపీల సమావేశానికి పిలిస్తే హైదరాబాద్ లోనే ఉన్న కిషన్ రెడ్డి రాలేదన్నారు. మనోహర్ లాల్ కట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఇచ్చామని మోదీ అన్నారు. అదే ఇవ్వమని మేం అడుగుతున్నామన్నారు. జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోంది. కిషన్ రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడుందన్నారు. రీజినల్ రింగ్ రోడ్ కు భూసేకఅణను అడ్డుకుంటుంది బీజేపీ ఎంపీలు ఈటల, లక్ష్మణ్ లేనని రేవంత్ అన్నారు. ప్రాజెక్టులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకుంటుంది రాష్ట్ర బీజేపీ నేతలేనని మండిపడ్డారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేసి గండపిండేరం తొడుగుతానని రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదన్నారు.

### జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి కేసీఆర్

రాష్ట్రంలో జీతం తీసుకుని పని చేయకుండా పడుకుంటున్న వ్యక్తి ఎవరైన ఉన్నారా అంటే అది ఒక్క కేసీఆరే అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా అన్ని సౌకర్యాలు, ఆర్థిక సౌకర్యాలు పొందుతున్న కేసీఆర్ ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. పైగా అప్పుడప్పుడు నిద్రలేచి ఏదో చేస్తా అని ప్రగల్భాలు పలుకుతున్నారని సీఎం రేవంత్ రెడ్డివిరుచుకుపడ్డారు. 10 ఏళ్ళలో అప్పులు తప్ప కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. అప్పుల విషయంలో కేసీఆర్ తప్పుడు లెక్కలు చూపెట్టారని, కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు కాగ్ రిపోర్ట్ అసెంబ్లీలో బయట పెడుతామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు దుర్మార్గులంటూ తెలంగాణలో శవాలు లేస్తున్నాయని తెలియగానే తీన్మార్ డాన్సులు చేస్తున్నారని మండిపడ్డారు. పంటలు ఎండితే ప్రతిపక్షాలు సంతోష పడుతున్నాయని, వాస్తవానికి ప్రజలు ప్రజలు ఇబ్బందులు పడితే బాధ పడాలన్నారు. ఇంత దుర్మార్గులు ప్రపంచంలో ఎవరైనా ఉంటారా? అని అన్నారు.

### రోజమ్మ పెట్టిన రొయ్యల పులుసు తిన్నదెవరు ?

10 ఏళ్ళు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఈ తలనొప్పులు ఉండకపోయేదన్నారు. ఏపీతో పేచీయే ఉండేది కాదన్నారు. ప్రగతి భవన్ కి పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టింది ఎవరని ప్రశ్నించారు. ఏపీకి వెళ్ళి రోజమ్మ ఇంట్లో రొయ్యల పులుసు తిన్నదెవరని అడిగారు. దావత్ లు, విందులు చేసుకున్నప్పుడే నీటి కేటాయింపులు, నిధుల అంశంపై మాట్లాడి సాధించి ఉంటే బాగుండేదన్నారు.

## మంద కృష్ణ అంటే నాకు గౌరవమే

ఎంఆర్ పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ అంటే తనకు గౌరవం ఉందన్నారు. రిజల్ట్ కి రిజర్వేషన్లకు సంబంధం లేదన్నారు. సుప్రీం తీర్పు వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి నోటిఫికేషన్ తర్వాత కొత్త నిర్ణయాలు తీసుకుంటే కోర్టులో ఆగిపోతుందని పేర్కొన్నారు. ఏపీలో ఎస్సీ వర్గీకరణ చేయనందుకు వాళ్లు మంచోళ్ళు, మేం వర్గీకరణ చేస్తున్నందుకు చెడ్డవాళ్ళమా? అని నిష్టూరమాడారు. ఈ విషయాలను గ్రహించకుండా మాట్లాడటం సరైంది కాదన్నారు. సమావేశంలో భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## ఘనంగా జరుపుకున్న దక్షిణ మధ్య రైల్వే

**మహా:** దక్షిణ మధ్య రైల్వే అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025ను సోమవారం రైల్ నిలయంలోని ఆడిటోరియంలో ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు; దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్; సామాజిక కార్యకర్త మరియు ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ సునీతా కృష్ణన్ విశిష్ట అతిథిగా; దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి గౌరవ అతిథిగా; దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం; దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ మరియు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త 'పద్మశ్రీ' సునీత కృష్ణన్ మాట్లాడుతూ, మహిళా సాధికారతను మరింత బలోపేతం చేయడానికై ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనం ఇంకెంత దూరం వెళ్లాలో అంచనా వేయడానికి మహిళా దినోత్సవం ఒక సందర్భమని అన్నారు. 'మార్పు నుండి మార్పు వస్తుంది' అని పేర్కొన్నారు. లింగం అనేది సామాజిక దృగ్విషయం, దానిని అర్థం చేసుకోవడం ద్వారా మార్చవచ్చు అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి పౌరులుగా మలచాల్సిన బాధ్యత వారిపై ఉందని పేర్కొన్నారు . ఈ సంధర్భంగా మహాత్మా గాంధీ ప్రసిద్ధ సామెతను ఆమె గుర్తుచేశారు , "మీరు ప్రపంచంలో చూడాలనుకునే మార్పుకు అనుగుణంగా ముందు మీరూ మారండి, మరియు నేను మొదటగా మారతాను అటుపిమ్మట సమాజం మార్పుకై ప్రయత్నిస్తానని అని ప్రతి ఒక్కరూ వాగ్దానం చేయాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వేకు మహిళా ఉద్యోగులు నిజమైన గర్వ కారణమని, వారు అన్ని రంగాలలోనూ నిజాయితీ, అంకితభావంతో రాణిస్తున్నారని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో 7,650 మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఇది మొత్తం శ్రామిక శక్తిలో దాదాపు 10% అని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారతను సాధించడంలో మనం చాలా దూరం వచ్చామని, ఇంకా ముందుకు సాగాలని కూడా ఆయన పేర్కొన్నారు. పని ప్రదేశాలలో మహిళా సహోద్యోగి సురక్షితంగా, సంతోషంగా ఉండేలా చూడటం ప్రతి ఉద్యోగి బాధ్యత అని ఆయన అన్నారు. జోన్‌లోని మూడు ముఖ్యమైన విభాగాలకు నాయకత్వం వహిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్; ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ; ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌లను కూడా ఆయన ఈ సందర్భంగా అభినందించారు. దేశానికి, దక్షిణ మధ్య రైల్వేకు వన్నె తెచ్చిన మహిళా క్రీడాకారుల కృషికి ఆయన వారిని అభినందించారు. ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి నారీ శక్తి (మహిళా ఉద్యోగులు) యొక్క అద్భుతమైన విజయాలను ప్రశంసించారు సంస్థ వృద్ధిపై వారి పాత్ర చెరగని ముద్ర వేసిందని పొగిడారు. దక్షిణ మధ్య రైల్వే మహిళల భద్రతను కాపాడటానికి, మహిళా శ్రామిక శక్తి సంక్షేమానికై కట్టుబడి ఎల్లవేళలా ఉందని ఆయన పేర్కొన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ అనే శక్తివంతమైన ఆయుధం మహిళా ఉద్యోగులను రక్షించడానికి దక్షిణ మధ్య రైల్వే వద్ద ఉందని ఆయన పేర్కొన్నారు.

# సౌందర్య మరణం వెనుక కుట్ర?

## మంచు మోహన్ బాబుపై సంచలన ఆరోపణలు

ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

హెలికాప్టర్ ప్రమాదం కాదు – హత్య అంటూ తీవ్ర ఆరోపణలు

జల్‌పల్లిలోని గెస్ట్‌హౌజ్ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్

మోహన్ బాబు నుండి ప్రాణహాని ఉందని ఫిర్యాదుదారుడి ఆరోపణ

మంచు మనోజ్‌కు న్యాయం చేయాలని లేఖలో విజ్ఞప్తి



**ఖమ్మం మహా:** టాలీవుడ్‌లో అప్పట్లో గ్లామర్‌తో పాటు మంచి నటనతో ప్రేక్షకులను మెప్పించిన నటి సౌందర్య మృతి గురించి మరోసారి సంచలన ఆరోపణలు బయటకొచ్చాయి. ఆమె హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిందన్న కథనంపై కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా, సినీ నటుడు మంచు మోహన్ బాబు సౌందర్య మరణానికి కారకుడని, ఇది కేవలం ప్రమాదం కాకుండా ఓ కుట్రగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఖమ్మం జిల్లా రూరల్ మండలానికి చెందిన వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

**సౌందర్య మరణం – మళ్లీ తెరపైకి కొత్త ఆరోపణలు**

ఖమ్మం జిల్లా రూరల్ మండలం సత్యనారాయణ పురం గ్రామానికి చెందిన ఎదురుగట్ల చిట్టిబాబు అనే వ్యక్తి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తన లేఖలో సినీ నటుడు మంచు మోహన్ బాబు నటి సౌందర్య మరియు ఆమె సోదరుడు అమర్నాథ్‌ను హత్య చేయించాడని, ఆయనపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాదు, మోహన్ బాబు వల్ల తనకు ప్రాణహాని ఉందని, తగిన భద్రత కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

**జల్‌పల్లిలోని గెస్ట్ హౌజ్ వివాదం**

చిట్టిబాబు ఫిర్యాదు ప్రకారం, నటి సౌందర్యకు శంషాబాద్, జల్‌పల్లిలో ఆరు ఎకరాల గెస్ట్ హౌజ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ గెస్ట్ హౌజ్‌ను మోహన్ బాబు కొనుగోలు చేయాలని కోరగా, సౌందర్య, ఆమె సోదరుడు అమర్నాథ్ స్పష్టంగా తిరస్కరించారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీనితో కక్ష పెంచుకున్న మోహన్ బాబు, బెంగుళూరు నుంచి తెలంగాణకు హెలికాప్టర్‌లో వెళ్తున్న సమయంలో ప్రమాదం అనే ముసుగులో హత్య చేయించాడని చిట్టిబాబు లేఖలో ఆరోపించారు.

**గెస్ట్ హౌజ్‌ను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్**

లేఖలో మరో కీలక అంశం ఏమిటంటే, ప్రస్తుతం ఆ ఆరు ఎకరాల గెస్ట్ హౌజ్‌ను మోహన్ బాబు అక్రమంగా అనుభవిస్తున్నాడని, ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంచు కుటుంబానికి చెందిన ఆస్తుల విషయంలో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని, వీటిపై సంక్షిప్తంగా కాకుండా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలన్న హితవు**

ఈ వివాదంలో మరో ఆసక్తికర కోణం ఏమిటంటే, మోహన్ బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్‌కు న్యాయం చేయాలని లేఖలో చిట్టిబాబు స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ

ఈ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోహన్ బాబు, సౌందర్య మరణం, గెస్ట్ హౌజ్ వివాదంపై ఇప్పటికే అనేక కథనాలు వినిపించినప్పటికీ, ఇంత నేరుగా ఓ వ్యక్తి ఆరోపణలు చేయడం, అధికారులకు ఫిర్యాదు చేయడం ముదిరిన వివాదంగా మారింది. ప్రస్తుతం ఈ ఆరోపణలపై మోహన్ బాబు స్పందించాల్సి ఉంది. అలాగే, ప్రభుత్వం, చట్టపరమైన సంస్థలు ఈ ఫిర్యాదుపై ఏమాత్రం స్పందిస్తాయో వేచి చూడాల్సి ఉంది.



# 15 నెలల్లో 1,52,918 కోట్ల అప్పు తెచ్చారు

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎమ్మెల్సీ కవిత
- కేసీఆర్ తెచ్చిన అప్పులకు పూర్తి లెక్కలు చెబుతాం

**మహా :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై, ఇతర సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం బీఆర్ఎస్ పేగులు తెగేలా పోరాడిందని, అప్పటి కష్టం మరువలేనిదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కొన్ని సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఆ పోరాటంలో కొంతమందికి మాత్రం ఎలాంటి పాత్రా లేదని ఆమె పేర్కొన్నారు. ఉద్యమంలో ఎలాంటి పాత్ర లేని వ్యక్తి రేవంత్ రెడ్డి అని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమ సమయంలో ఉద్యమ కారులపై గన్నులు ఎక్కించిన వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. రేవంత్ రెడ్డి వంటి వ్యక్తి ఇప్పుడు తెలంగాణ ప్రజల తరపున మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెప్పారని, ఈ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసినట్లు కవిత అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ ఆర్థిక పరిస్థితి పై చర్చ జరుగుతోందని, రాష్ట్రానికి వచ్చే ఆదాయం రూ. 18,800 కోట్లు ఉంటుందని ఆమె తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల రూ. 3,000 కోట్లు ఖర్చు చేస్తున్నదని, కానీ, జాతీయ మీడియా మాత్రం ఈ ఖర్చు రూ. 500 కోట్లు మాత్రమేనని తప్పుగా చెబుతోందని కవిత విమర్శించారు. గడిచిన 15 నెలల్లో 1,52,918 కోట్ల అప్పు తీసుకొచ్చారని, ఆ డబ్బులు ఎటు పోయాయో ప్రజలకు వివరించాలని కవిత డిమాండ్ చేశారు. కేసీఆర్ తెచ్చిన అప్పులకు పూర్తి లెక్కలు చెబుతామంటూ ఆమె స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్ష నేతలు లక్షా 50 వేల కోట్ల అప్పులకు లెక్క చెప్పగలరా అని ప్రశ్నించారు.

# ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

## పాత ప్రాజెక్టుల నిర్వహణ పై దృష్టి పెట్టండి


### ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**మహా :** ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో జరిగిన సాగునీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు పలు అంశాలు చర్చించారు. ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టు ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, AMRP లో ఐదవ పంపు ఏర్పాటు చేసుకునే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పూర్తిగా స్టడీ చేసి గోదావరి నీటితో పాలేరు రిజర్వాయర్ ను పరిపుష్టం చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరిధిలో బస్వాపూర్ మొదలు సింగూరు వరకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏదుల నుంచి వట్టెం ఏదుల కాలువలు గుర్తు చేసుకోవాలని ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టిసారించాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న భూ సేకరణ, పాత ప్రాజెక్టుల నిర్వహణ, క్యాపిటల్ వర్క్స్ పై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునికరించుకోవడం, కాలువలకు లైనింగ్ ద్వారా ప్రాజెక్టుల జీవితకాలం పెరుగుతుందని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. గత పది సంవత్సరాల పాటు పరిపాలించిన వారు కేవలం ఒక్క కాలేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి, రాష్ట్రంలో ఉన్న పాత ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని గాలికి వదిలేయడంతో అవి ప్రమాదంలో పడే పరిస్థితి ఎదురైందని వివరించారు. పాత ప్రాజెక్టులను కాపాడుకునేందుకు మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూనే, కేంద్ర నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు రాబట్టేందుకు ఉన్న అవకాశాలను త్వరితగతిన పరిశీలించాలని మంత్రులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక లీగల్ టీం ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టుల గేట్ల పరమతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువలను బలోపేతం చేసుకునే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు అడ్డగోలుగా ఎక్కువ వడ్డీ రేట్లు కు అప్పులు తేవడంతో ఆ భారం ప్రస్తుత ఖజానా నిర్వహణపై పడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు 10% వడ్డీ రేటుకు అప్పులు తేగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వడ్డీ రేట్లు 8 శాతానికి తగ్గించేందుకు అధికారులు మంచి ప్రయత్నం చేశారని మంత్రులు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. ఈ పథకం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, జనరల్ అనిల్, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఆ ఐదుగురు.. ఇక కౌన్సిల్‌కు అందరూ తొలిసారే

- కోలాహలంగా అసెంబ్లీ ఆవరణలో నామినేషన్లు
- కార్యక్రమానికి సీఎం రేవంత్, భట్టి, మహేష్ గౌడ్, మంత్రులు, కేటీఆర్, సీపీఐ రాజా, నారాయణ




**హైదరాబాద్, మహా:** ప్రధాన పార్టీలు లెక్క ప్రకారం బరిలోకి దింపడంతో.. ఇక ఎంపిక చేసిన అభ్యర్థులంతా శాసనమండలిలోకి అడుగుపెట్టడం ఖాయమైంది. తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, సీపీఐ పార్టీ నుంచి నెల్లికంటి సత్యం , బీఆర్ఎస్‌తరుపున దాసోజు శ్రావణ్‌కుమార్ నామినేషన్‌వేశారు. కాంగ్రెస్‌అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విప్ రాంచంద్రనాయక్, ఆది శ్రీనివాస్, మధు యాష్కీ తదతరులు హాజరయ్యారు. బీఆర్ఎస్‌అభ్యర్థి తరుపున బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గంగుల కమలాకర్, సునీత లక్ష్మారెడ్డి లు హాజరయ్యారు. సీపీఐ పార్టీ అభ్యర్థి తరుపున సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, నారాయణ, అజీజ్‌పాష, రాష్రకార్యదర్శి కూనం నేని సాంబశివరావులు వెంట వచ్చారు. అసెంబ్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా సీఎల్పీ ఆఫీసులోకి వెళ్లారు. అక్కడే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్‌గౌడ్‌మంత్రులు, ఎమ్మెల్సీ అభ్యర్థులతో చర్చించారు. సీపీఐ నేతలు డి.రాజా, నారాయణ, కూనం నేని సాంబశివరావు, అభ్యర్థి సత్యం సీఎల్పీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అనంతరం విజయశాంతి రావడంతో సీఎం అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌లతో కలిసి అసెంబ్లీలో నామినేషన్ల దాఖలులో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పర్వంతో అసెంబ్లీ ఆవరణ కోలాహలంగా మారింది. నామినేషన్లు వేసిన కాంగ్రెస్ అభ్యర్థులు తర్వాత గన్ పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించారు. నామినేషన్ల కార్యక్రమంలో కీలక నేతలు మధుయాష్కీగౌడ్ , గాలి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# ఫార్మ్ హౌజ్ చెప్పినట్టు టెన్ జన్ పథ్ నడుచుకోవాలా?

**రేవంత్ రెడ్డి సీఎం అయిన నాటి నుంచి ఆయన దిగిపోవాలని లేదా తొలగించాలని ఆ పార్టీ అధిపతి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ బలంగా కాంక్షిస్తున్నట్టు పలు సందర్భాలలో బట్టబయలయ్యింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కన్నా,రేవంత్ ముఖ్యమంత్రి కావడమే 'తండ్రీ,కొడుకు'లను కలచివేస్తున్న అంశం.**



'కాంగ్రెస్ పార్టీలో రేవంత్ ఆట ముగిసింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఆయన ప్రతిపాదనను హైకమాండ్ తిరస్కరించింది అంటూ బిఆర్ఎస్ మీడియా ఒక కొత్త వంటకాన్ని వండి వార్చింది. కాంగ్రెస్ పార్టీకి హైకమాండ్ ఢిల్లీలో ఉంటుంది కనుక అక్కడే నిర్ణయాలు జరుగుతాయి. బిఆర్ఎస్ హైకమాండ్ ఎర్రవల్లి ఫార్మ్ హౌస్ లో ఉంటుంది కనుక అక్కడే ఆ పార్టీ నిర్ణయాలు జరుగుతాయి. ఇందులో కొత్త 'రెసిపీ' ఏమిటి? సీఎం రేవంత్ కానీ, ఇతర నాయకులను కానీ ఢిల్లీకి రావొద్దని పార్టీ హైకమాండ్ ఆదేశించడం శుభపరిణామం. కొన్ని విషయాల్లో రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ముఖ్యమంత్రి రేవంత్ కు లభించింది. శాసన మండలి,రాజ్యసభ స్థానాలకు ఎవరిని ఫైనల్ చేయాలన్నది హైకమాండ్ విచక్షాధికారం. తాము చెప్పినట్లుగా కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకోవాలి అన్నట్టుగా బిఆర్ఎస్ వైఖరి కనిపిస్తోంది. ఇదొక వింత పోకడ. రేవంత్ రెడ్డి సీఎం అయిన నాటి నుంచి ఆయన దిగిపోవాలని లేదా తొలగించాలని ఆ పార్టీ అధిపతి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ బలంగా కాంక్షిస్తున్నట్టు పలు సందర్భాలలో బట్టబయలయ్యింది.కాంగ్రెస్ అధికారంలోకి రావడం కన్నా,రేవంత్ ముఖ్యమంత్రి కావడమే 'తండ్రీ,కొడుకు'లను కలచివేస్తున్న అంశం.

డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కుడిభుజమైన కేవీపీ.రామచందర్ రావుకు రాజ్యసభ టికెట్టు లభించలేదు. వైఎస్ఆర్ సీఎం పదవి చేబట్టిన వెంటనే వచ్చిన రాజ్యసభ ఎన్నికల్లో కేవీపీకి సీటు గ్యారంటీ అనే ప్రచారం జరిగింది. కేవీపీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.''తొందరపడి ఎవరూ నిర్ధారణకు రాకండి. కాంగ్రెస్ పార్టీ తో గేమ్స్ ఆడొద్దు. పార్టీలో ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు జరుగుతాయో ఊహించలేం''.అని కేవీపీ అప్పట్లో కామెంట్ చేసినట్లు సీనియర్ జర్నలిస్ట్ అమర్ దేవులపల్లి గుర్తుచేసుకున్నారు. కనుక వేం.నరేందర్ రెడ్డికి రాకపోయినా,విజయశాంతికి లభించినా కాంగ్రెస్ పార్టీలో అనూహ్యమైన ఘటనలు కావు. వీటిని గోరంతలు,కొండంతలు చేయదలచుకున్న వారికి,'సుపారీ మీడియా'కు తక్షణ మనశాంతి లభించవచ్చునేమో కానీ,అది పైశాచిక ఆనందమేనని భావించాలి.కేవీపీ ఎపిసోడ్ లో అప్పట్లో గిరీష్ సంఘీకి రాజ్యసభ సీటు ఇచ్చారు. నాడొక సంచలన ఘటన అది. నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఒక్క అంగుళం కూడా అసంతృప్తికి లోను కాలేదు. తన పని చేసుకుంటూ పోయారు. ఆ తర్వాత రాజ్యసభ ఎన్నికలు వచ్చిన సందర్భంలో కేవీపీకి అవకాశం లభించింది.

కాంగ్రెస్ పార్టీలో పాతతరం నాయకుల్లో వ్యతిరేకత కనిపిస్తుండగా, కొత్తతరం ఓటర్లు దూరంగా ఉండడంపై పార్టీ హైకమాండ్ దృష్టి సారించవలసి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ అంటే నిర్ణయాలు వెంటనే

> **రేవంత్ రెడ్డి ఆలోచనలు 20:20 మ్యాచ్ లాగా కనిపిస్తుంటే పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి ఆలోచనలు టెస్టు మ్యాచ్ వలె ఉన్నాయి.' జై బాపు' అంటే మహాత్మాగాంధీ అని ఈ తరం,ముఖ్యంగా యువతరానికి ఏమి తెలుసు. జై భీమ్ అంటే భారత రాజ్యాంగ నిర్మాతః డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎంతమందికి గుర్తున్నది.' సంవిధాన్' భారత రాజ్యాంగం అని ఎట్లా ప్రచారం చేస్తే ప్రజలకు అర్థం కాగలదు? 'జై బాపు' అంటే తెలంగాణలో కేసీఆర్ అని చాలా మంది పొరబడే అవకాశాలున్నవి. కనుక ఈ పదాన్ని మార్చడం మంచిదని నా అభిప్రాయం.**

తీసుకోకుండా సాచివేత వైఖరి కొనసాగించే పార్టీ అన్న విమర్శలున్నవి. ఇప్పుడిప్పుడే ఈ వైఖరిలో కొంత మార్పు వస్తోంది. నిర్ణయాలలో నాన్చే వైఖరికి దాదాపు ముగింపు పలికినట్లేనన్న విశ్లేషణలున్నవి. ఆ పార్టీలో ఉన్న పాతతరం నాయకత్వం ఆధిపత్యంపై పార్టీ శ్రేణుల్లో,ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. మరోవైపు కొత్తతరం ఓటర్లను ఆకట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమవుతోందని ఆ పార్టీకి ఎన్నికల్లో లభిస్తున్న ఓట్ల శాతాన్నిబట్టి తెలుస్తోంది.గతంలో ఒక సర్వేలో రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని ఇష్టపడుతున్న వాళ్ళు 20 శాతం కూడా లేదు.

సోనియాగాంధీ,రాహుల్ గాంధీ కోటరీలోని వ్యక్తులే సలహాదారులుగా,పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జులుగా బలమైన పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ గా బాధ్యతలు చేబట్టిన మీనాక్షి నటరాజన్ కూడా అదే కేటగిరీ వ్యక్తి.' జై బాపు,జై భీమ్,జై సంవిధాన్' నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ నినాదం పలకడానికి నోరు తిరగడం లేదు. మీనాక్షి నటరాజన్ ఆధునిక మహిళే కానీ పాతకాలపు ఆలోచనలున్నట్టు కనబడుతోంది. అలాగే గాంధీ,నెహ్రూ సిద్ధాంతాలు పట్టుకొని ముందుకుపోవాలని ఆమె కోరుతున్నారు.రేవంత్ రెడ్డి ఆలోచనలు 20:20 మ్యాచ్ లాగా కనిపిస్తుంటే పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి ఆలోచనలు టెస్టు మ్యాచ్ వలె ఉన్నాయి.'జై బాపు' అంటే మహాత్మాగాంధీ అని ఈ తరం,ముఖ్యంగా యువతరానికి ఏమి తెలుసు.జై భీమ్ అంటే భారత రాజ్యాంగ నిర్మాతః డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎంతమందికి గుర్తున్నది.'సంవిధాన్' భారత రాజ్యాంగం అని ఎట్లా ప్రచారం చేస్తే ప్రజలకు అర్థం కాగలదు? 'జై బాపు' అంటే తెలంగాణలో కేసీఆర్

> **డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కుడిభుజమైన కేవీపీ. రామచందర్ రావుకు రాజ్యసభ టికెట్టు లభించలేదు. వైఎస్ఆర్ సీఎం పదవి చేబట్టిన వెంటనే వచ్చిన రాజ్యసభ ఎన్నికల్లో కేవీపీకి సీటు గ్యారంటీ అనే ప్రచారం జరిగింది. కేవీపీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.''తొందరపడి ఎవరూ నిర్ధారణకు రాకండి. కాంగ్రెస్ పార్టీ తో గేమ్స్ ఆడొద్దు.పార్టీలో ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు జరుగుతాయో ఊహించలేం''.అని కేవీపీ అప్పట్లో కామెంట్ చేసినట్లు సీనియర్ జర్నలిస్ట్ అమర్ దేవులపల్లి గుర్తుచేసుకున్నారు. కనుక వేం.నరేందర్ రెడ్డికి రాకపోయినా,విజయశాంతికి లభించినా కాంగ్రెస్ పార్టీలో అనూహ్యమైన ఘటనలు కావు.**

> **కేవీపీ ఎపిసోడ్ లో అప్పట్లో గిరీష్ సంఘీకి రాజ్యసభ సీటు ఇచ్చారు. నాడొక సంచలన ఘటన అది. నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఒక్క అంగుళం కూడా అసంతృప్తికి లోను కాలేదు. తన పని చేసుకుంటూ పోయారు. ఆ తర్వాత రాజ్యసభ ఎన్నికలు వచ్చిన సందర్భంలో కేవీపీకి అవకాశం లభించింది.**

> **తెలంగాణలో సమిష్టి కార్యాచరణ కరువయ్యింది. కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ శ్రమను తక్కువ చేసి మాట్లాడుతున్నవాళ్ళు,నాలుగైదు సార్లు ఎమ్మెల్యేలు,మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్న వాళ్ళు రేవంత్ రెడ్డిని ఇంకా 'పరాయి వ్యక్తి'గా భావిస్తున్నారు. ఇలాంటి భావన పార్టీ హైకమాండ్ నిర్ణయాన్ని ధిక్కరించడం కిందకు వస్తుంది. ప్రజల అవసరాలు, అభిరుచులు, అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ మారాల్సి ఉందన్నది రేవంత్ రెడ్డి అభిప్రాయం. ప్రజాజీవితంలో సుదీర్ఘకాలం పాటు ఓర్పుతో, పట్టుదలతో, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలన్నదే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం కావాలని పలు సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు పిలుపునిస్తున్నారు.ప్రజా సమస్యలకు అనుగుణంగా పనిచేయాలి.ప్రత్యర్థి పార్టీల కంటే తాము బాగా పనిచేస్తాం అని చెప్పడమే కాకుండా అలాంటి నమ్మకం జనానికి కలిగించాలని రేవంత్ అంటున్నారు.**

అని చాలా మంది పొరబడే అవకాశాలున్నవి.కనుక ఈ పదాన్ని మార్చడం మంచిదని నా అభిప్రాయం.

కాంగ్రెస్ పార్టీలో పాత తరానికీ, కొత్త తరానికీ మధ్య సంఘర్షణ చాలాకాలంగా ఉంది. జ్యోతిరాదిత్య సింధియా ,ఆర్పీఎన్ సింగ్ లాంటి నాయకులు వంటి కొత్త తరానికి చెందిన ఎంతో మంది నాయకులు, రాహుల్ గాంధీ సన్నిహితులు పార్టీని వదిలిపెట్టి ఇతర పార్టీల్లో చేరిపోయారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్ర, భారత స్వాతంత్ర్యఅనంతరం దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర గురించి ప్రస్తుత తరానికి తెలియజేసినా,వారిని ఆకట్టుకునేది ఎలా?. ఓటర్లు సోషల్ మీడియా,వాట్సాప్ ద్వారా ప్రభావితం అవుతున్న రోజులివి.అందుకే రేవంత్ పదే పదే '20:20 మ్యాచ్' గురించి ప్రస్తావిస్తున్నారు.ఈ కాలపు యువతరానికి, ప్రస్తుత సమాజానికి అవసరమైన విషయాలు ఏమిటో,వారిని ఎలా ఆకర్షించి కాంగ్రెస్ పార్టీ వైపు మళ్ళించాలో ఆలోచించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన. పనితీరు మెరుగుపరచుకోని వారు ,పార్టీకి భారంగా మారినవారు ఎంతటి పెద్ద వారయినా విధేయత పేరుతో వేలాడేవారిని పార్టీ నుంచి రాహుల్ గాంధీ తప్పించవలసిందే.

విధేయత కన్నా సమర్థతకు మారుతున్న సామాజిక,రాజకీయ సమీకరణాల్లో ఎక్కువ విలువ ఉన్నది. సిద్ధాంత పరమైన రాజకీయాలతో పాటు ప్రజల రోజువారీ జీవనంలో భాగంగా ఎదుర్కొనే సమస్యలపైన కూడా పోరాటం చేస్తూ, ప్రజలకు అండదండగా ఉండకపోతే కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రజాబలం భారీగా తగ్గిపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొన్ని సంవత్సరాలకే తెలంగాణ ముఖ్యమంత్రి పదవిని కైవసం చేసుకోవడం వెనుక 'విధేయత సమర్థత' ఫార్ములా ఉన్నది.విధేయతే కొలమానం అయితే శ్రీధర్ బాబు ,ఉత్తమ్ కుమార్ రెడ్డి,మల్లు భట్టి,కోమటిరెడ్డి వెంకటరెడ్డిలలో ఒకరికి సీఎం పదవి వరించేది.విధేయతతో పాటు పార్టీని విజయపథాన నడిపించగల శక్తి సామర్థ్యాలు ఉన్నందునే రేవంత్ కు ఆ అదృష్టం వరించింది. ఆయనపై ఎవరు అసూయ చెందినా,ఎవరు గోతులు తవ్వే ప్రయత్నం చేసినా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ చేయగలిగిందేమీ లేదు.

రేవంత్ రెడ్డికి వ్యతిరేకులైన సొంత పార్టీ నాయకులు, కేసీఆర్ పార్టీ ఆశించినంత మాత్రాన ఆయనను 'మార్పు' చేసే అవకాశాలు లేవు. అలా మార్చుకుంటూ పోతే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలలో జరిగిందేమిటో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కు తెలియనిది కాదు . తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి దిశా, నిర్దేశం చేస్తున్న నాయకునిగా 2023 డిసెంబర్ నుంచి రేవంత్ రెడ్డికి గుర్తింపు వచ్చింది. ఆ గుర్తింపు ఆయన కష్టార్జితం. రేవంత్ ను టచ్ చేసి, ఒక మమతా బెనర్జీ ,ఒక శరద్ పవార్,ఒక జగన్,ఒక కేసీఆర్ ను కొత్తగా తయారుచేసుకోవాలని అనుకోవడం లేదు. 2014 ఉమ్మడి ఏపీ విభజన సమయంలోనే,కేసీఆర్ కోరినట్టు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు సోనియా గాంధీ అంగీకరించి ఉంటే తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరోలా ఉండేది.అది గడచిన చరిత్ర అయినా కాంగ్రెస్ ను వెంటాడుతూనే ఉన్నది.జగన్ కోరినట్టు ఆయనకు ముఖ్యమంత్రి పదవినిచ్చి ఉంటే ఆయన వైఎస్ఆర్సీపీ పేరిట కొత్త పార్టీ పెట్టి అవశేష ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ను తుడిచిపెట్టేవారు కాదు.

అయితే డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి కూడా ఒక దశలో 'ప్రాంతీయ పార్టీ' ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేశారు. కొందరు హితులు,శ్రేయోభిలాషుల సూచనలతో వైఎస్ ఆ ఆలోచనలను ఉపసంహరించుకున్న సంగతి చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు.నాలుగు సార్లు ఎంపీగా 6 సార్లు ఎమ్మెల్యేగా గెల్చిన,పిసీసీ అధ్యక్షునిగా పనిచేసిన ఎదురులేని వైఎస్ లాంటి వారు కూడా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వైఖరితో,అనాలోచితపు విధానాలతో విసిగివేసారిపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రేవంత్ ను వైఎస్ రాజశేఖరరెడ్డితో పోల్చలేం కానీ ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు,వ్యూహాలు రచించి అమలు చేసినందువల్లనే కేసీఆర్ ను పడగొట్టగలిగారన్నది సత్యం.

ప్రజాస్వామ్యం,జాతీయవాదం,సెక్యులరిజం,సమ్మిళిత వృద్ధి,సామాజిక న్యాయం వంటి అంశాలు తమ సిద్ధాంతంగా కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. ఇందులో జాతీయవాదాన్ని బీజేపీ హైజాక్ చేసిపారేసింది. మిగిలిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ వంటి యువనాయకులు అమలుచేయడానికి కృషి చేస్తున్నారు. విధానపరమైన పోరాటాలకు ప్రజాబలం పెంచుకోవాలంటే,ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి కేంద్రీకరించడం ఒక్కటే మార్గం.రాష్ట్రాల్లో ఉన్న నాయకత్వం పట్ల,అంతులేని స్వార్థంతో పనిచేసే నాయకుల పట్ల వ్యతిరేకత ఉందే తప్ప నెహ్రూగాంధీ కుటుంబం పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేదని ఒక విశ్లేషణ ఉన్నది.కానీ ఆ సిద్ధాంతాలకు,తాజా వ్యూహాలను జోడిస్తే తప్ప క్లిక్ అయ్యే అవకాశం లేదు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీని అన్నివిధాలుగా బలోపేతం చేయకుండా కాంగ్రెస్ లో నాయకులు వ్యక్తిగతంగా బలపడడానికి ప్రయత్నిస్తున్నట్టు చాలా కాలంగా విమర్శలున్నవి. తెలంగాణలోనూ సమిష్టి కార్యాచరణ కరువయ్యింది. కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ శ్రమను తక్కువ చేసి మాట్లాడుతున్నవాళ్ళు,నాలుగైదు సార్లు ఎమ్మెల్యేలు,మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్న వాళ్ళు రేవంత్ రెడ్డిని ఇంకా 'పరాయి వ్యక్తి'గా భావిస్తున్నారు. ఇలాంటి భావన పార్టీ హైకమాండ్ నిర్ణయాన్ని ధిక్కరించడం కిందకు వస్తుంది.

ప్రజల అవసరాలు,అభిరుచులు,అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ మారాల్సి ఉందన్నది రేవంత్ రెడ్డి అభిప్రాయం. ప్రజాజీవితంలో సుదీర్ఘకాలం పాటు ఓర్పుతో,పట్టుదలతో,ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలన్నదే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం కావాలని పలు సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు పిలుపునిస్తున్నారు.

> **పనితీరు మెరుగుపరచుకోని వారు,పార్టీకి భారంగా మారినవారు ఎంతటి పెద్ద వారయినా విధేయత పేరుతో వేలాడేవారిని పార్టీ నుంచి రాహుల్ గాంధీ తప్పించవలసిందే. విధేయత కన్నా సమర్థతకు మారుతున్న సామాజిక,రాజకీయ సమీకరణాల్లో ఎక్కువ విలువ ఉన్నది. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొన్ని సంవత్సరాలకే తెలంగాణ ముఖ్యమంత్రి పదవిని కైవసం చేసుకోవడం వెనుక 'విధేయత - సమర్థత' ఫార్ములా ఉన్నది. విధేయతే కొలమానం అయితే శ్రీధర్ బాబు,ఉత్తమ్ కుమార్ రెడ్డి,మల్లు భట్టి,కోమటిరెడ్డి వెంకటరెడ్డిలలో ఒకరికి సీఎం పదవి వరించేది. విధేయతతో పాటు పార్టీని విజయపథాన నడిపించగల శక్తి సామర్థ్యాలు ఉన్నందునే రేవంత్ కు ఆ అదృష్టం వరించింది. ఆయనపై ఎవరు అసూయ చెందినా,ఎవరు గోతులు తవ్వే ప్రయత్నం చేసినా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ చేయగలిగిందేమీ లేదు.**

ప్రజా సమస్యలకు అనుగుణంగా పనిచేయాలి.ప్రత్యర్థి పార్టీల కంటే తాము బాగా పనిచేస్తాం అని చెప్పడమే కాకుండా అలాంటి నమ్మకం జనానికి కలిగించాలని రేవంత్ అంటున్నారు.

ఉమ్మడి ఏపిలో 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన 90 సీట్లలో తెలంగాణకు చెందిన 42 సీట్లు ఉండడం విశేషం.2004 లో టీడీపీ చిత్తు చిత్తుగా ఓడిపోయింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 52 సీట్లు, టీఆర్ఎస్ 26 సీట్లు గెలిచింది. 2009 లో కాంగ్రెస్ తెలంగాణ వాటా 51 సీట్లు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన తర్వాత 2014లో 20 సీట్లు మాత్రమే గెలవడం ఒక విషాదం. 2009లో కెసిఆర్ నిరాహారదీక్షకు తలొగ్గి కేంద్రం ప్రత్యేక తెలంగాణాకు అనుకూలమైన ప్రకటన చేసినప్పుడు,ఆంధ్ర ప్రాంతంలో అలజడి రేగినపుడు ఆ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. 2014 లో ఎన్నికలకు ముందు ఏపీ విభజన జరిగింది. ప్రత్యేక తెలంగాణ యిచ్చిన కాంగ్రెస్ పార్టీకి కాకుండా టిఆర్ఎస్ ను గెలిపించారు.ప్రస్తుత రాజకీయాలకూ,పాత రాజకీయాలకూ చాలా తేడా ఉంది.'ఎలక్షన్ స్టంట్', 'పొలిటికల్ డ్రామా' రాజకీయాలు,ఎన్నికల మేనేజ్ మెంటు కీలకపాత్ర పోషిస్తున్నవి.కేవలం ప్రచారం చేసి, తర్వాత తమతమ వ్యక్తిగత జీవితాలకు పరిమితం అయితే ఇప్పుడున్న రాజకీయాలకు సరిపోదు. 'గెస్ట్ అప్పియరెన్స్' వ్యవహారాలకు కాలం చెల్లింది.

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు సూత్రాలు కానీ,ఉచిత తాయిలాలు కానీ గెలుపునకు పనిచేయలేదని, కేసీఆర్ కుటుంబం చేసిన భయంకరమైన అవినీతి, వాళ్ళ అహంకారమే బిఆర్ఎస్ ఓటమికి కారణంగా విశ్లేషణలున్నవి. కాంగ్రెస్ మీద ప్రేమ కంటే, టీఆర్ఎస్ మీద ఆగ్రహమే దీనంతటికీ బలమైన కారణం.నీళ్లు నిధులు ,నియామకాలు,ఆత్మ గౌరవం,అమాయకత్వం,నిరాడంబరత,పేదరికం,ఫ్యూడల్ వ్యవస్థల వలన బహుజన సంస్కృతి అణచివేత,పేదరికంతోపాటు వచ్చిన నిరక్షరాస్యత,ఉపాధి,సొంత ఇల్లు లాంటి ప్రాథమిక అవసరాలతో పాటు నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాలకు ఆశపడే మెజారిటీ యువజనమంతా కలిసి,పోరాడి తెలంగాణను సాధించుకున్నారు.



**- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్**

తెలంగాణ రాష్ట్రం వస్తే పేదరికం, నిరుద్యోగం పోతుందని,కోటి ఆశలతో కేసీఆర్ కు పట్టం కడితే, తెలంగాణ అస్తిత్వం కోలుకోలేనంత ధ్వంసమైనట్టు ఆరోపణలు వస్తున్నవి. పల్లె పాడెక్కింది. పట్టణాలు పరాధీనమైనయి. తెలంగాణను తాగుబోతుల స్వర్గధామంగా మార్చినట్టు విమర్శలూ ఉన్నవి. పోరాటం అనే డిఎన్ఏతో రూపుదిద్దుకున్న 'తెలంగాణ ఆత్మగౌరవం' దొర గడి ముందు సాగిలపడింది. 2% లేని కులానికి మంత్రివర్గంలో 6 మంత్రి పదవులు దక్కాయి. సీఎం ఆఫీసులో సెక్రటేరియట్లో "రావు"లదే పెత్తనం. మారుమూల ప్రాంతాల్లోని రావులను నగరానికి రప్పించి 'నయా దొరలను' తయారు చేశారని కెసిఆర్ పై నిందలున్నవి. ఉస్మానియా యూనివర్సిటీ కెసిఆర్ 10 ఏళ్ల పాలనలో ఉసూరు మన్నది.విప్లవంలో కాకలు తీరిన 'కాకతీయ' నీరుకారిపోయింది. నైజాం నవాబును గోరి కడతానని పాడిన నల్గొండ నలిగిపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా వార్త రాసే పరిస్థితి లేకుండా చేశారు.ప్రధాన స్రవంతి మీడియాలో మొత్తం కేసీఆర్, కేసీఆర్ కుటుంబాన్ని కీర్తించడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియకుండా దాచిపెట్టగలిగింది.కాగా నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ అక్కున చేసుకుని క్షేత్రస్థాయిలో వాళ్లతో ప్రచారం చేయించింది.ప్రతిపక్షానికి ప్రజలకు మీడియా సహాయం చేయనప్పుడు,సోషల్ మీడియా తెలంగాణ సమాజ పక్షాన నిలబడి తన గొంతు విప్పింది.అది ప్రజలకు సూటిగా చేరింది.దాన్ని కాంగ్రెస్ ఒడిసిపట్టింది. పాలన ప్రభుత్వం నలుగురి చేతులో బందీ అయింది.

ఇక్కడే కాంగ్రెస్ ప్రజల నాడి పట్టుకుంది.ఆ నలుగురు బదులు ఇక్కడ 40 మంది నాయకులు తయారయ్యారు. రేవంత్ రెడ్డి,భట్టి విక్రమార్క,సీతక్క,ఉత్తంకుమార్,కోమటిరెడ్డి,దుద్దిల్ల శ్రీధర్ బాబు,పొన్నం,కొండా, జూపల్లి,పొంగులేటి శ్రీనివాసరెడ్డి,తుమ్మల,డాక్టర్ జి.వివేక్ లాంటి బహుళ నాయకత్వం ప్రజల్లోకి దూసుకుపోయారు. కాంగ్రెస్ నాయకులు జనం వెంట నడిచారు, జనంతో ఉన్నారు, ఆపదలో ఉన్న జనాన్ని ఓదార్చారు. కేసీఆర్ కుటుంబం ప్రభుత్వ పదవులతో నయా రాచరికం అనుభవించడాన్ని జనం జీర్ణించుకోలేకపోయారు.ముఖ్యమంత్రి కెసిఆర్ సచివాలయానికి రాలేదు.మిగతా వారిని ఎవరిని రానివ్వలేదు. .తెలంగాణ సమాజాన్ని,ఉద్యమకారులను,నిరుద్యోగులను,విద్యార్థులను కించపరచడం. గొంతు విప్పి ప్రశ్నించిన వాడిని అక్రమ అరెస్టులతో అణిచివేయడం కొనసాగింది. "ప్రగతి భవన్" అనే పేరుతో ఉండే అభేద్యమైన "దొర గడి" మళ్ళీ రావాలని ఇప్పటికీ కొందరు భజనపరులు మాట్లాడుతున్నారంటే మనమెంత 'బానిస' మనస్తత్వానికి అలవాటు పడ్డామో అర్థమవుతోంది. రైతుబంధు పేరుతో భూస్వాములు,సినిమా వాళ్లకు రియల్టర్లకు కోట్లలో అధికారికంగా దోచిపెట్టిన ఉదంతాలు వెలుగులోకి వస్తున్నవి.తన కన్నా ఎక్కువ పోరాటం చేసిన వాళ్లను, పోరాట రూపాలను నామరూపాలు లేకుండా చేయడంలో కేసీఆర్ సఫలీకృతులయ్యారు.ప్రజలు తిరస్కరించినందుకు కేసీఆర్,కేటీఆర్ 15 నెలల తర్వాతకూడా పశ్చాత్తాపం ప్రకటించకపోవడంవిడ్డూరం.

జనంలో పాపులారిటీ సాధించుకున్న రేవంత్ రెడ్డిని తమ పాత రాజకీయాల ఒరవడిలో బలి చేయకుండా ఆయనను ముఖ్యనాయకుడిగా హైకమాండ్ ఫోకస్ ముఖ్యమైన మలుపు. రేవంత్ రెడ్డిని కెసిఆర్ లాంటి దొరను ఎదురించే 'హీరో'గా తెలంగాణ సమాజం గుర్తించింది. కాంగ్రెస్ సరైన సమయంలో రేవంత్ రెడ్డిని ప్రాజెక్ట్ చేసింది. రేవంత్ రెడ్డి ఒక సామాన్యుడు,ఎంత పెద్ద స్థాయికయినా వెళ్తాడు అని జనం నమ్మారు. అందుకే కాంగ్రెస్ కు అధికారం కట్టబెట్టారు.అలాంటి రేవంత్ రెడ్డిని ఇబ్బందులపాల్జేయాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ పరిశీలకులంటున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# 16 తర్వాత నాకు మళ్ళీ నోటీసులొస్తాయ్

## రేవంత్ రెడ్డి ఇన్ సైడర్ ట్రేడింగ్.. ఈసారి సభకు కేసీఆర్

### చిట్ చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కు అవమానం జరగొద్దనేదే తన ఉద్దేశమని చెప్పారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వం చెప్పే అబద్ధాలపై మాట్లాడాలా..? అని ప్రశ్నించారు. వీళ్ల స్థాయికి తాము సరిపోతామని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖ చేయాల్సిన విచారణ చేసే కుంభకోణాలకు రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని, ఆయనను కేంద్రం కాపాడుతోందని అన్నారు. ఆర్ ఆర్ టాక్స్ అని మోదీ ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పారని, ఇప్పుడెందుకు అరెస్టు చేయడం లేదని అని ప్రశ్నించారు. అమృత్ స్కాంపై తాను ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేస్తే ఇంతవరకూ స్పందించలేదని అన్నారు. రాహుల్ గాంధీ గుజరాత్ లో మాట్లాడుతూ తమ పార్టీలో కోవర్టులు ఉన్నారని చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ మొదటి నుంచి స్ట్రాంగ్ సెంటర్, వీక్ స్టేట్ ఉండాలని కోరుకుంటోందని, అందుకే రేఖా గుప్తాను ఢిల్లీ సీఎంను చేసిందని చెప్పారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫోన్ల ట్యాపింగ్ నడుస్తోందని, ప్రైవేటు వ్యక్తులు కూడా ట్యాపింగ్ లో పాల్గొంటున్నారని ఆరోపించారు. తమతో ఐఏఎస్ లు టచ్ లో ఉన్నారనే విషయం ఫోన్ ట్యాపింగ్ ద్వారానే తెలుసుకున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వెనుక ఉన్న రియల్ ఎస్టేట్ బ్రోకర్లు విచ్చలవిడిగి టీడీఆర్ భూములను కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇన్ సైడర్ ట్రేడింగ్ చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి రాష్ట్రం కోసం డబ్బులు సంపాదించడం తెలియదని, వ్యక్తిగత సంపాదనలో ఆయనే టాప్ సీఎం అని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని, గవర్నర్ స్పీచ్ రోజు హాజరవుతారని అన్నారు.

**16 తర్వాత ఫార్ములా ఈ కేసులో నోటీసులు**

బడ్జెట్ సమావేశాల అటెన్షన్ డైవర్ట్ చేయడానికి మళ్లీ ఫార్ములా ఈ కార్ రేసింగ్ అంశాన్ని తెరమీదకు తెస్తారని కేటీఆర్ అన్నారు. తాను ఫార్ములా ఈ రేసు కోసం 46 కోట్లు పెడితే ఏడుస్తున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు రూ. 200 కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ నెల 16 నుంచి 27వ తేదీ మధ్యలో తనకు నోటీసులు వస్తాయని భావిస్తున్నట్టు చెప్పారు. దుబాయ్ లో ఎవరో చనిపోతే తనకేం సంబంధమన్నారు. రేవంత్ కు పిచ్చి అభిప్రాయాలు ఉన్నాయన్నారు.




స్టాలిన్ నిర్వహించే జేఏసీ మీటింగ్ కు వెళ్లాలా..? లేదా అనేది కేసీఆర్ డిసైడ్ చేస్తారన్నారు. రాష్ట్ర మంత్రి 30% కమీషన్ తీసుకొని సెటిల్మెంట్ చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని అన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఇలాంటి ఆరోపణ ఎప్పుడైనా వచ్చిందా అని అన్నారు. సిల్వర్ జూబ్లీ కోసమే వరంగల్ లో సభ పెడుతున్నామని చెప్పారు.



# హైదరాబాద్‌లో దారుణం

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో విషాదం చోటు చేసుకుంది. హబ్సిగూడలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. భార్యా భర్తలు ఇద్దరితో పాటు పిల్లలు కూడా చనిపోవడం తీవ్ర విషాదం మిగిల్చింది. హబ్సిగూడ లో ముందుగా ఇద్దరు పిల్లలను చంపి తర్వాత భార్యా భర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్న పోలీసులు.. చనిపోయిన వారు చంద్రశేఖర్ రెడ్డి (41), కవిత (35), పిల్లలు శ్రీత (13), విశ్వంత్ (10) గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులే కారణం కావచ్చునని అనుమానిస్తున్నారు.

# క్రికెట్ అభిమానులపై పోలీసుల లాఠీఛార్జ్

### సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఫొటోలు, వీడియోలు
### పోలీసుల తీరుపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మహా :** పెద్ద టోర్నీల్లో భారత్ విజయం సాధిస్తే దేశ వ్యాప్తంగా సంబరాలు జరుపుకోవడం మామూలే. ఇందులో భాగంగానే తాజాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్‌పై భారత్ అద్భుత విజయం సాధించింది. దీనితో 12 ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని మళ్లీ భారత జట్టు ముద్దాడింది. ఈ సందర్భాన్ని దేశవ్యాప్తంగా పలు నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభిమానులు జాతీయ జట్టు విజయాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. భారత్ జట్టు విజయం సాధించిన అనంతరం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పలుచోట్ల క్రికెట్ అభిమానులు రోడ్ల మీదకు వచ్చి బాణాసంచా కాల్చారు. అయితే, క్రికెట్ ప్రియుల ఆనందోత్సాహాన్ని పోలీసులు అడ్డుకోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ అనంతరం హైదరాబాద్ లోని దిల్‌సుఖ్ నగర్, సెక్రటరియేట్, అమీర్ పేట సహా పలు ప్రాంతాల్లో క్రికెట్ అభిమానులు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. అయితే, పోలీసులు అభిమానులను చెదరగొట్టడానికి లాఠీఛార్జ్ చేయడం తీవ్ర విమర్శలకు గురైంది. క్రికెట్ ప్రేమికులు దేశంపై తమకు ఉన్న ప్రేమను, జాతీయ జట్టు విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటుంటే పోలీసుల లాఠీఛార్జ్ సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. కాకపోతే,



పోలీసులు మాత్రం వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రాత్రి సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు అభిమానులను పంపించేందుకు మాత్రమే ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. కొన్ని సోషల్ మీడియాలో విజయోత్సవ సంబరాలను జరుపుకుంటున్న క్రికెట్ అభిమానులపై పోలీసులు లాఠీలు ఝలిపించినట్లు పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ పోస్టులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ పోలీసుల తీరును తప్పుపట్టారు. ఎవరి కోసం పోలీసులు ఇంత అత్యుత్సాహం చూపిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఎప్పుడు ఎలా స్పందించాలో తెలియనట్లుగా పోలీసులు వ్యవహరించడం బాధాకరమన్నారు.



# విద్యా ప్రదాత సీఎం రేవంత్ రెడ్డి

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్ పర్సన్ తాండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి
- కొందుర్గులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ నిర్మాణానికి భారీ నిధులు ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" కృషి

**మహా:** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాప్రదాతగా నిలుస్తున్నారని విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ 11 వేల కోట్ల రూపాయలు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కోసం కేటాయించడం గొప్ప పరిణామం అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్ పర్సన్, కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి తెలిపారు. సోమవారం మీడియా విడుదల చేసిన ప్రకటనలో ఆమె పేర్కొంటూ.. తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందించడానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలకు 11వేల కోట్లు కేటాయించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. ఇందులో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి దాదాపు 20 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించడం శుభపరిణామమని ఆమె అన్నారు. నియోజకవర్గంలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు సహకరించి కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే ఈ రెసిడెన్షియల్ పాఠశాల చరిత్రలోనే నిలిచిపోతుందని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. అదేవిధంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ శంకుస్థాపన కోసం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గతంలో ఇక్కడికి తీసుకురావడం కూడా చారిత్రాత్మక ఘట్టం అని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం చారిత్రాత్మకం

## రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలకు రూ. 11వేల కోట్లు

### షాద్ నగర్ నియోజకవర్గంలో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయింపు
### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషికి అభివందనం
### షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు రఘు నాయక్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరుల హర్షం
### షాద్ నగర్ మీడియా సమావేశంలో ప్రభుత్వానికి కాంగ్రెస్ నేతల ధన్యవాదాలు

**మహా:** రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.11 వేల కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, ఇది ఎంతో గొప్ప విషయమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి రఘునాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 55 పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ విద్యాశాఖ ద్వారా శనివారం జారీ చేయించిన ఉత్తర్వుల వివరాలను విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఈ పాఠశాలల్లో షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు యంగ్ ఇండియా రీజినల్ పాఠశాల కూడా ఉండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృ



తజ్ఞతలు తెలియజేశారు. పేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకే సమీకృత గురుకులాలు ఏర్పాటు చే చేస్తుండడం ఒక చరిత్రగా నిలిచిపోతుందని తెలిపారు. దేశంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా ఈ గురుకులాలు ఉంటాయని పేర్కొన్నారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే పాఠశాలలో తరగతి గదులతోపాటు అద్భుతమైన క్రీడా ప్రాంగణం, గ్రంథాలయం, ల్యాబ్‌లు, డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన వసతులు ఉంటాయని వారు చెప్పారు.

# క్రీడల పోటీల వలన క్రీడాకారుల నైపుణ్యాలు మెరుగవుతాయి

## రేగడి చిలకమర్రిలో రేగడి చిలకమర్రి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

### ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
### రేగడి చిలకమర్రి ప్రీమియర్ లీగ్ క్రికెట్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**మహా:** క్రీడల పోటీల వలన క్రీడాకారులలోని నైపుణ్యాలు మెరుగవుతాయని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. కొందుర్గ్ మండలం లోని రేగడి చిల్కమర్రి గ్రామంలో రేగడి చిల్కమర్రి ప్రీమియర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమైనవి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడ నిర్వాహకులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ క్రీడల్లో పాల్గొనడం వలన, క్రికెట్ క్రీడను ఆడడం వలన క్రీడాకారులు శారీరక దృఢత్వం పెరిగి, మానసిక సంతులన కలిగి క్రీడాకారులలో ఆలోచన విధానం పెరుగుతుందని అన్నారు. క్రీడల పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి లోపల క్రీడా స్ఫూర్తిని రగిలించారు. ఈ కార్యక్రమంలో తో కొందుర్గు మండలం మాజీ వైస్ ఎంపీపీ



రాజేష్ పటేల్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ లు, బంధులాల్, టేకులపల్లి మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, ఖలీల్, ప్రేమ్ కుమార్, ఆంజనేయులు, ఉపసర్పంచ్లు కుమార్, యాదయ్య గౌడ్ మరియు, దర్గ రాంచెంద్రయ్య, హరిశ్వర్ రెడ్డి, శేఖర్, కిరణ్, వీరేందర్ రెడ్డి, వేణు, శ్రీకాంత్, సందీప్, పి. శేఖర్, సత్యం, పెర్మల్ రెడ్డి, రాములు, ఉమెంతల్ క్రిష్ణ, నర్సిములు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ విత్ డ్రాలు, అనుమానాస్పద ఖర్చులపై ఇంకమ్ ట్యాక్స్ నిఘా

**మహా :** బ్యాంకు ఖాతాలనుంచి తక్కువ విత్ డ్రా చేస్తున్నారా ... వంట నూనె, ఉప్పులు, పప్పులు, సౌందర్య సాధనాలు, విద్య, రెస్టారెంట్ విజిట్స్, హెయిర్ స్టైల్స్ వంటి వాటిపై ఎక్కువ ఖర్చు చేస్తున్నారా..అయితే జాగ్రత్త.. ఇటువంటి వారిపై ఇంకమ్ ట్యాక్స్ డిపార్టుమెంట్ నిఘా ఉంచింది. ఐటీ నోటీసులు జారీ చేస్తోంది. బ్యాంకు ఖాతాలనుంచి తక్కువ విత్ డ్రాలు చూపిస్తున్న కొంతమంది వ్యక్తులకు ఆదాయపన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. డేటా విశ్లేషణ ద్వారా పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వంట నూనె, గోధుమ, బియ్యం, గ్యాస్, షూ, సుగంధ ద్రవ్యాలు, సౌందర్య సాధనాలు, విద్య, రెస్టారెంట్ విజిట్స్, హెయిర్ స్టైల్స్ వంటి వాటిపై ఎంత ఖర్చు చేశారనే దానితో సహా తక్కువ విత్ డ్రాల వివరాలు ఇవ్వాలని ఐటీ శాఖ కోరింది. అధిక ఆదాయం ఉన్నట్టు చూపిస్తున్న మంది మాత్రమే చాలా తక్కువ ఖర్చు చేస్తున్నారని మిగతా వారి ఖర్చులపై ఐటీ శాఖ అధికారులు అనుమానాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల వార్షిక ఆదాయం, పాన్ నంబర్లతో సహా వారి వివరాలను కూడా ఇవ్వాలని కోరింది. వివరాలను సమర్పించని వారి అంచనా ప్రకారం ఆ సంవత్సరానికి వారి ఇంటి నుంచి రూ.1 కోటి విలువైన విత్ డ్రాలు జరిగి ఉంటాయని భావిస్తోంది. ఈ నోటీసులు సాధారణమైనవి కావు..విలాసవంతమైన జీవనశైలిని గడుపుతున్నప్పటికీ వారి బ్యాంకు ఖాతాల నుంచి చాలా తక్కువ విత్అ చేస్తున్నారు.. అటువంటి వారిపై అనుమానంతో నోటీసులు పంపించినట్లు ఐటీశాఖ అధికారులు అంటున్నారు.ఇటువంటి ఖర్చుల్లో అప్రకటిత అదనపు ఆదాయ వనరు లేదా నగదు ఉండవచ్చని అధికారులు అనుమానంతో నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నారు.

# బీజేపీ బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం



(మొదటి పేజీ తరువాయి)

గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు నేను తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాను. పార్టీ హైకమాండ్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలనుకుంటుందో అదే ఇస్తుంది. పార్టీలో ఉన్నవారందరూ కాస్త ఓపిక పట్టాలి. పార్టీ నాకు ఎప్పుడు బాధ్యతలు అప్పగిస్తుందో.. అప్పుడే మాట్లాడాలి.. పని చేయాలి అని అనుకున్నాను. అవకాశం కోసం ఎదురు చూశాను. కాంగ్రెస్ పార్టీలో ఒక సిస్టమ్ ఉంది. అది మీరకుండా ప్రతిఒక్కరూ పనిచేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా పోరాడుతాం'' అని అన్నారు.

**రాష్ట్రంలో ఆ ఇద్దరూ ఒకటే**

రాష్ట్రంలో బీజేపీ బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని విజయశాంతి తీవ్ర ఆరోపణలు చేశారు. తాము తెలంగాణలో ఉద్యమకారులమని, ఉద్యమకారిణిగా కాంగ్రెస్ ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల్లా అడుక్కోవడానికి తామేం బిచ్చగాళ్ళం కాదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ను ఓడించేందుకు బీజేపీ నాయకులు తనను వారి పార్టీలోకి ఆహ్వానించారని.. కానీ లోపల మాత్రం బీజేపీ, బీఆర్ఎస్ తో చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. అందుకే తాను బీజేపీ నుంచి బయటకి వచ్చినట్టు పేర్కొన్నారు. బీసీ మహిళా నేతగా.. నా అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించిందని, అందుకే తనకు ఎమ్మెల్సీ సీటు కేటాయించారని తెలియజేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. తనను కేబినేట్ లోకి తీసుకోవడంపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని, అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటానని విజయశాంతి వెల్లడించారు.

# బీహార్‌లో భారీ దోపిడి





**మహా:** బీహార్‌లో సినీఫక్కీలో బంగారు నగల చోరీ జరిగింది. ఎనిమిది మంది సాయుధులు తనిష్క్ బంగారు నగల షోరూంలోకి ప్రవేశించి సిబ్బంది పై తుపాకీ గురిపెట్టి రూ.25 కోట్ల విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం 10 గంటలకు షోరూమ్‌ను తెరవగా ఎనిమిది మంది దుండగులు తుపాకులతో లోనికి ప్రవేశించారు. భద్రతా సిబ్బంది వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకొని షోరూంను మూసివేశారు. అనంతరం తమ వద్దనున్న ఆయుధాలతో షోరూం సిబ్బందిని దుండగులు బెదిరించారు. షోరూం సిబ్బంది మొత్తాన్ని ఒక చోట ఉంచి అల్మరాలు, పెట్టెల్లో ఉన్న నగలను మొత్తం దోచుకున్నారు. ఈ సమయంలో షోరూం సిబ్బంది ఒకరు రాగా దుండగులు అతడిపై దాడి చేశారు. ఈ దృశ్యాలన్నీ షోరూంలోని సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. దుండగులు నగలతో ఉడాయించగానే షోరూం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఖాకీలు వారిని వెంబడించారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారు. వారిని అరెస్టు చేసిన పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుమారు రూ.25 కోట్ల విలువైన బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయని షోరూం మేనేజర్ తెలిపారు. దుండగులు ఎత్తుకెళ్లిన వాటిలో గోల్డ్ చైన్లు, నెక్‌లెస్‌లు, వజ్రాభరణలు ఉన్నాయని చెప్పారు. నిందితులు తుపాకులతో కొట్టడం వల్ల తమ సిబ్బంది ఇద్దరు గాయపడ్డారని వెల్లడించారు. దొంగతనానికి 8 నుంచి 9 మంది వచ్చారని చెప్పిన ఆయన వారిలో కొంత మంది తమ సిబ్బంది వద్ద ఉండగా మరికొందరు నగలను లూటీ చేశారని చెప్పారు. దోపిడీ జరిగిన సమయంలో షోరూంలో 25 మంది సిబ్బంది ఉన్నారని మేనేజర్ తెలిపారు.

# ఇంటర్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంపై బోర్డు క్లారిటీ

## సోమవారం జరిగిన పరీక్షలో క్వశ్చన్ పేపర్‌లో చాట్ ఆధారంగా ఇచ్చిన 7 ప్రశ్నకు ప్రింట్ లోపం

### ఆ ప్రశ్న ప్రయత్నించిన వారందరికీ ఫుల్ మార్క్స్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రంలో నెలకొన్న గందరగోళంపై ఇంటర్ బోర్డు కీలక ప్రకటన జారీ చేసింది. సోమవారం జరిగిన ఇంగ్లీష్ రెండవ సంవత్సరం ప్రశ్నాపత్రంలో 7వ ప్రశ్నలో పై చార్ట్ కు సంబంధించిన ప్రశ్నలో కొంత మంది విద్యార్థుల ప్రశ్నాపత్రంలో ముద్రణలో గీతల అస్పష్టతను గుర్తించినట్లు బోర్డు వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనిపై సబ్జెక్ట్ నిపుణులు విపులంగా చర్చించారు. విద్యార్థులకు న్యాయం చేయాలనే సంకల్పంతో జవాబును సమాధాన పత్రంలో రాయడానికి ప్రయత్నించిన వారందరికీ ప్రశ్నకు కేటాయించిన మార్కులు ఇవ్వనున్నట్లు బోర్డు ప్రకటించింది. దీంతో విద్యార్థుల్లో నెలకొన్న గందరగోళానికి తెరపడినట్టైంది. కాగా సోమవారం జరిగిన పరీక్షలో క్వశ్చన్ పేపర్‌లో చాట్ ఆధారంగా ఇచ్చిన 7 ప్రశ్నకు ప్రింట్ లోపం ఏర్పడింది. ప్రశ్నపత్రంలోని ఏడో ప్రశ్నలో డిస్టింగ్‌క్షన్, మెరిట్, పాస్, ఫెయిల్ అనే ఆప్షన్స్ గుర్తించే వీల్లేకుండా అంటే కనిపించకుండా ప్రింట్ వచ్చింది. ఇన్విజిలేటర్స్




ని స్టూడెంట్స్ అడిగితే అందరికీ అలాగే ప్రింట్ వచ్చిందని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఇంటర్ ప్రశ్నాపత్రం ప్రింటింగ్ సరిగ్గా లేకపోవడం వల్ల 4 మార్కులు నష్టపోతున్నారని స్టూడెంట్స్, పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రింటింగ్‌లో క్వాలిటీని పెంచాలని స్టూడెంట్స్, పేరెంట్స్ ఇంటర్ బోర్డును కోరారు.




# తెలంగాణ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ ఒక ప్రధాన ఘట్టం


(మొదటి పేజీ తరువాయి)

అనంతరం వారు నాటి ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో "మిలియన్ మార్చ్" ఒక ప్రధాన ఘట్టమని, నాడు ఆ కార్యక్రమంలో లక్షలాది తెలంగాణ బిడ్డలు స్వచ్ఛందంగా ట్యాంక్‌బండ్ మీదికి చేరుకొని విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి అమర వీరుల త్యాగం మరవలేనిదని, వారి ఆత్మా స్థైర్యం, స్ఫూర్తిని అందరూ గుండె లోతుల్లో నిలుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యమ ఆకాంక్షల సాధనకై అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం అని ఆయన పేర్కొన్నారు. నాటి జెఏసి నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాసగౌడ్, సంధ్య, దేవీ ప్రసాద్,చెరుకు సుధాకర్ అశ్వత్థామరెడ్డి, గాలివినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా గన్ పార్క్ వద్ద అద్దంకి దయాకర్, విజయశాంతి, మధుయాష్కీ తదితరులు నివాళులు అర్పించారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాల అవకతవకలపై కలెక్టర్ కు ఫిర్యాదు

- విధులకు హాజరుకాని వారికి నెల నెల జీతాలు
- రమావత్ సక్క నాయక్ మాజీ వార్డ్ మెంబర్





**హుజూర్ నగర్, మహా :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంపోడు ప్రభుత్వ గిరిజన పాఠశాల లో జరిగిన అవకతవకలపై ఆ గ్రామ మాజీ వార్డు నెంబర్ రమావత్ సక్క నాయక్ సోమవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే గిరిజన ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎం ను పట్టించుకోని హెచ్ డబ్ల్యు ఓ. గత నవంబర్ నెల నుండి మార్చి 3 వరకు విధులకు హాజరు కాలేదని, హాజరు కానీ ఏఎన్ఎం కు నాలుగు నెలల బిల్లు పేమెంట్ చేశారని పిల్లలకు రాత్రివేళ ఆరోగ్య సమస్యలు వస్తే టాబ్లెట్స్ ఇచ్చే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని ఏఎన్ఎం కు జీతం ఎలా ఇస్తారని దీనిపై విచారణ జరపాలని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్యటర్, సిగరెట్స్ తాగుటకు అలవాటు పడ్డారని, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లకు మరియు హాస్టల్ వార్డెన్ రవికుమార్ కి పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయం పట్టించుకోవడంలేదని, డబ్ల్యూహెచ్వో రవికుమార్ నైట్ డ్యూటీ విధులకు హాజరు కావడం లేదని, విద్యార్థులను పట్టించుకునే నాధుడే లేడని వారి భవిష్యత్తు అంధకారమేనని ఆవేదన వ్యక్తపరిచారు. కాబట్టి వీరి స్థానంలో వేరే అధికారులు నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని, మత్తు పానీయాల నుండి విద్యార్థులను విముక్తి చేయాలని కోరారు. బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో రాత్రి స్టడీ అవర్ నిర్వహించుటకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదాడ కు చెందిన లేడీ ట్యూటర్ నీ నియమించారని ట్యూటర్ నియామకం నోటిఫికేషన్ లేకుండా , డిటిడిఓ సూర్యాపేట, హెచ్ఎం , డబ్ల్యూహెచ్వో , కుమ్మక్కై స్థానికులకు తెలవకుండా నియమించారని తెలిపారు. వారిని వివరణ అడగగా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ వారి బంధువులను హెచ్ఎం వెంకటేశ్వర్లు ట్యూటర్ గా నియమించారు. ఏమైనా నోటిఫికేషన్ వేశారా లేకపోతే పై అధికారులు ఆర్డర్ ఎవరికైనా ఇచ్చారా అని వివరణ అడగగా అలాంటిది లేదని సమాధానం అలాంటప్పుడు బయట వ్యక్తిని ఎలా నియమిస్తారని స్థానికులు నిలదీశారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు కంప్యూటర్ టీచర్ అని చెప్పి ట్యూటర్ గా నియమించారని ఆ గ్రామంలో ఉన్నత చదువులు చదువుకున్న యువతీ యువకులు ఉన్నారని వారిని ట్యూటర్ గా తీసుకోవాలని సోమవారం కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అలాగే బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు 68 మంది ఉండగా గతంలో 243 మంది ఉన్నట్టుగా చూపిస్తూ సోప్ బిల్ పైసలు నొక్కేస్తు, విద్యార్థులకు ఇవ్వవలసిన పెట్టెలు స్థానికంగా 68 మంది విద్యార్థులు ఉండగా రిజిస్టర్లో 243 మంది విద్యార్థులను చూపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని పాఠశాలలోనే వార్డెన్ నివాసం ఉండాలని ప్రభుత్వ రూల్స్ ఉండగా సాయంత్రం ఐదు గంటలకి విద్యార్థులకు భోజనం అయిన అనంతరం ఇంటికి తిరుగు పయనం అవుతున్నారని నైటు పిల్లలకు ఏదైనా జరిగితే ఇక అంతే సంగతులని పాఠశాలపై కలెక్టర్ విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్దు నాయక్, నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు.. సాగు నీరు అందించాలి

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






**వరంగల్, మహా ;** హైదరాబాదు సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ పీ. గోపి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ లు, పోలీసు అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య మాధ్యమం) ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి మాట్లాడుతూ.. నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటలకు సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్ లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ఎక్కడా పంటలు ఎండిపోకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి డీసీపీ అంకిత్ కుమార్, ఇరిగేషన్ మున్సిపల్ , అధికారులు సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో మంత్రి పొన్నం పూజలు



**వేములవాడ, మహా :** దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం జరిగింది,సర్వేజనా సుఖినోభవంతు సమృద్ధిగా వర్షాలు కురుస్తూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని వేడుకోవడం జరిగింది,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకెళ్ళాలి ఆ వేములవాడ రాజన్న ఆశీర్వాదం ఇవ్వాలి ,వేములవాడ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్లే బలాన్ని కూడా ఇవ్వాలని వేడుకున్న మంత్రి, అనంతరం మీడియాతోమాట్లాడుతూ..రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేసిన సర్వే తరువాత జరిగిన శాసనసభ్యుల ద్వారా ఎంపిక అయ్యే శాసన మండలి అభ్యర్థులను బలహీన వర్గాలకు కేటాయించడం శుభసూచకం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ,ఎస్టీ, బీసీ బిఆర్ఎస్ ఒక బీసీ, సిపిఐ కి కేటాయించిన సీటు కూడా బీసీకి కేటాయించండి.. ఈ ఐదు స్థానాలు కూడా పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీకి ఇవ్వడం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా స్వాగతిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా ఇదే ఉత్సాహాన్ని ,ప్రోత్సాహాన్ని తీసుకుని రాబోయే కాలంలో 42 శాతం రిజర్వేషన్ల తో పాటు అందరూ ఐక్యంగా ఉండి సామాజిక ఆర్థిక రాజకీయ అంశాల్లో ఎదగాలని కోరుతున్న ఇదే సందర్భంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహచర మంత్రులకు ధన్యవాదాలు ఈరోజు పెద విద్యార్థులు చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లు చదువుకునే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం 11 వేల కోట్లతో 55 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం సంక్షన్ చేయడం దేశ చరిత్రలో విప్లవాత్మక నిర్ణయం ఒక విద్యార్థి నాయకుడిగా బలహీన శాఖ మంత్రిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను

**చాలా చారిత్రక నిర్ణయం**

11 వేల కోట్లు 55 నియోజక వర్గాల్లో ఈ యంగ్ ఇండియా స్కూల్లో ఏర్పాటు చేయనున్నారు Msme పరిశ్రమల ఏర్పాటు బలహీన వర్గాలు ఉపయోగించుకుని ,బీసీ సబ్ ప్లాన్ భవిష్యత్తులో బీసీలు రాజకీయంగా ఉపయోగించుకోవాలన్నారు.

# అంతర్జాతీయ జూడో పోటీలకు అంధ విద్యార్థులు



**వరంగల్, మహా ;** అంతర్జాతీయ స్థాయి జూడో పోటీలకు అర్హత సాధించిన అంధ విద్యార్థులను బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాల కు చెందిన యాజమాన్యం విద్యార్థులు సోమవారం ప్రధాన కార్యాలయం లో బల్దియా కమిషనర్ డా.అశ్విని తా నాజీ వాకడే ను కలిశారు. ఈ సందర్భం గా పాఠశాల బాధ్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 2428 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని లక్నో లో జరిగిన 13 వ నేషనల్ పారా జూడో పోటీలకు అంధుల పాఠశాల కు చెందిన 9 మంది విద్యార్థులు జూడో పోటీలకు ఎంపికై అట్టి క్రీడల్లో పాల్గొని 5 గురు విజేతలుగా నిలిచి బంగారు వెండి కంచు పథకాలను సాధించడం జరిగిందని జి.వినోద్ కుమార్ పి.నాగరాజు అనే విద్యార్థులు మే 816 వరకు కజకిస్థాన్ దేశం లోని ఆస్తానా లో జరిగనున్న ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భం గా కమిషనర్ విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ సాధించాలనే తపన ఉంటే వైకల్యం అవరోధం కాదని అంధ విద్యార్థుల సంకల్పం గొప్పగా ఉందని అంతర్జాతీయ స్థాయి లో రాణించి నగరానికి వన్నె తీసుకువచ్చారని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని కమిషనర్ ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో సాధించిన ట్రోఫీ మెడల్స్ ను కమిషనర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ జోనా, పాఠశాల కరస్పాండెంట్ నలివేల కల్యాణి, మేనేజ్మెంట్ సభ్యులు మణిశంకర్ ,అంధ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఐజీకి ఘన వీడ్కోలు



**రామగుండం, మహా :** పోలీస్ కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో బదిలీ పై వెళ్తున్న ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి కి పోలీసుల గౌరవ వందనాలు సమర్పించి, గజమాలలతో సత్కరించి వాహనంలో సీపీ ని హెడ్ క్వార్టర్స్ గేట్ వరకు కమీషనరేట్ పోలీసు అధికారులందరూ సిబ్బంది వాహనం కు ఏర్పాటు చేసిన తాడును లాగి సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీ పై వెళ్తున్న సీపీ మాట్లాడుతూ.... రామగుండం పోలీస్ కమీషనరేట్ లో పని చేసిన సమయం, చేసిన కార్యక్రమాలు మరువలేనివని ఎంతో తృప్తి నీ ఇచ్చాయని తెలియజేశారు. 13 నెలలపాటు చేసిన సమయంలో సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందికి మరియు సీపీఓ సిబ్బందికి ప్రతి ఒక్కరికి సీపీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కష్టపడుతూ అందరి సమన్వయము తో పార్లమెంటు ఎన్నికలను, VVIP ల కార్యక్రమాలు, పోటీ పరీక్షలు మరియు పండుగలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోకుండా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ లో పని చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ఇక్కడి ఆఫీసర్లు, సిబ్బంది సమస్వయం, ఒక టీమ్ లాగా అందరూ కలిసి కట్టుగా పని చేయడం బాగుందన్నారు.

# అంతరించిపోతున్న రంగస్థల కళలను కాపాడుకోవాలి



**హుజూర్ నగర్, మహా :** అంతరించిపోతున్న రంగస్థల కళలను కాపాడుకోవాలని స్పందన నాట్య కళా మండలి అధ్యక్షులు కొట్టు లక్ష్మీనారాయణ బాబు అన్నారు. స్తానిక ప్రజాభవన్ లో సోమవారం కళాకారులకు, కలాభిమానులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో రంగస్థల కళలను ప్రోత్సహించే కలాభిమానులను, అద్యక్షులు కొట్టు లక్ష్మీనారాయణ బాబు ధనలక్ష్మి దంపతులను సన్మానించారు. అనంతరం కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గొట్టే వెంకట రామయ్య పాలేటి రామారావు, ఊరే వెంకయ్య, చిట్యాల అమర్నాథ్ రెడ్డి, పోతురాజు రమేష్, గోపు చెలినమ్మ, వంకాయల పద్మ, రౌత్ వేంకటేశ్వర రావు, మాష్టర్ కొండలు, కంబాల శ్రీనివాస్, పొనుగుపాటి వాసుదేవరావు ఇందిరాల శ్రీనివాస్, అన్నెం పాపిరెడ్డి గోపనబోయిన వేంకటేశ్వర్లు, కొట్టు రాము, కొల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మందుల సామేలు పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు,మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలకు,విమర్శలకు ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, మోత్కూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, గుండగోని రామచంద్రు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్ తీవ్రంగా స్పందించారు. తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే మందులు విశేష కృషి చేస్తున్నారని వారన్నారు. మోత్కూర్ రహదారి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూడలేకనే బిఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కంచర్ల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ నేతలు చూస్తున్నారని అన్నారు. కంచర్ల రామకృష్ణారెడ్డి ఉద్దేశించి మాట్లాడుతూ వెంచర్ల పంచాయతీలో లక్షలు వసూలు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. గాదరి కిషోర్ తో కలిసి ఇసుక తందాలు చేసింది మీరు కాదా అన్నారు. నీ సొంత కొడుకు సహకార సంఘం చైర్మన్ కావడానికి డబ్బులు చేత పట్టుకొని కాంగ్రెస్ వాళ్ళ ఇంటికి తిరిగింది మీరే కదా అని గుర్తు చేశారు. అలాంటి మీరు కాంగ్రెస్, ఎమ్మెల్యే మందుల సామేల్ ను విమర్శించడం అస్యపదంగా ఉందన్నారు. ప్రజలు ఎవరి నిజస్వరూపం ఏంటో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం కవిత లక్ష్మీ నరసింహారెడ్డి మాట్లాడుతూ, "మున్సిపాలిటీలో అభివృద్ధి ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. అభివృద్ధిలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే తెచ్చిన నిధులతో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు , మంచినీటి కోసం పైపులైన్లు ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో తీసుకపోతున్న మందుల సామేల్ పై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రచారం చేస్తే, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని తగిన రీతిన బుద్ధి చెప్తారని,మండల ప్రధాన కార్యదర్శి బాలరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, పేలపూడి సత్యనారాయణ చౌదరి, మల్లారెడ్డి, నాయకులు పోలినేని ఆనందమ్మ, పోలినేని స్వామి రాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, పోచం జగన్, నాయకులు, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, బద్దం నాగార్జున రెడ్డి, మందుల సురేష్, బయని రాజు, పల్లపు సమ్మన్న, గుండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ కస్తాల శ్రావణ్ కుమార్ మృతి



**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ మండల కేంద్రంలోని ప్రదాన రహదారి ప్రక్కన కోర్టు ముందర సాయంత్రం నాలుగు గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. హుజూర్ నగర్ మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్ కుమార్ వయసు (48) కు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందారు. డెడ్ బాడీ ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో ఉంచడం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హుజూర్నగర్ ఎస్సై తెలిపారు. అంత్య క్రియలు రేపు ఉదయం జరుగునని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని మజీతే ఏ నూర్ మసీద్ ప్రాంగణంలో పర్లేర్ల వెంకన్న ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాస దీక్షను ముగించుకుని, ప్రార్థనలు చేసి పవిత్రతను పొందారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ వెంకన్న రంజాన్ మాసం సోదర భావం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత భేదాలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఇఫ్తార్ విందులో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మత సామరస్యాన్ని బలపరిచేందుకు దోహదం చేస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో పర్లేర్ల వెంకన్నను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షాకిరుద్దీన్ ప్రచార కార్యదర్శి మజీతే ఏ నూర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సమీరుద్దీన్, జిట్ట నరేష్, మజీద్ కమిటీ సభ్యులు సీనియర్ మొహమ్మద్ మునీరుద్దీన్, ఎండి ఖలీల్, మహమ్మద్ షాకిరుద్దీన్, అమీర్, జానీ పాషా, అలిముద్దీన్, జాంగిర్ పాషా, సలీం, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు నియమకాలు నిలిపివేయాలి



**హుజూర్ నగర్, మార్చి 10,మహా:** ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు ఉద్యోగ నియమకాలు నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఇరుగు ప్రభు మాదిగ అన్నారు. జరగబోయే శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకొస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పి మండల కమిటీ అధ్వర్యం లో మఠంపల్లి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి బచ్చలకూరి ప్రసాద్ మాదిగ రావడం జరిగినది ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు బానోత్ లచ్చీరాం నాయక్ ఓ యు విద్యార్థి నాయకులు సపవత్ సుమన్ నాయక్ ఏస్. సైదా నాయక్ పాల్గొని పూల మాలవేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు విహెచ్ పి ఎస్ జిల్లా నాయకులు అమరారపు సైదులు ఎంఎస్పి పార్టీ మండల అధ్యక్షులు కస్తాల వెంకటేశ్వర్లు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నాయకులు చెడపంగు జోజీ, కుర్రి శ్రీను యాతవాకిల్లా గ్రామ శాఖ అధ్యక్షుడు కుర్రి శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిన్న పంగూ ఆదినారాయణ కందుకూరి వెంకటేశ్వర్లు మంగళపల్లి జోజి తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఫిర్యాదులను పరిష్కరించండి

**వరంగల్, మహా;** ప్రజావాణిలో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కారనిమిత్తం వివిధ విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు

**విభాగాల వారిగా**

**1.ఇంజనీరింగ్....23**
**2.హెల్త్ & సానిటేషన్.....10**
**3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)..11**
**4.టౌన్ ప్లానింగ్....38**
**5.మంచినీటి సరఫరా.......07**
**6.హార్టికల్చర్...01**
**మొత్తం.... 90 గా అధికారులు వెల్లడించారు.**

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, ఇన్చార్జి సి పి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# చివరి గంటలో లాభాలు ఆవిరి..!

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అన్నిరంగాల్లో అమ్మకాలు కనిపించాయి. ఉదయం మార్కెట్లు లాభాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం.. 74,474.98 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత అదే ఉత్సాహం మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,741.25 గరిష్ఠానికి చేరుకుంది. అయితే, చివరి సెషన్‌లో లాభాల స్వీకరణకు దిగడంతో ఒక్కసారిగా మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 74,022.24పాయింట కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 217.41 పాయింట్లు తగ్గి.. 74,115.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92.20 పాయింట్లు తగ్గి.. 22,460.30 వద్ద ముగిసింది. మొదటి అర్ధభాగంలో నిఫ్టీ 22,650 పాయింట్ల మార్క్‌ను ధాటడంతో లాభాలను ఆర్జించింది. కానీ, చివరి గంటలో లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, ఓఎన్‌జీసీ, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో నిఫ్టీలో ప్రధాన నష్టాలను చవిచూశాయి. పవర్ గ్రిడ్ కార్ప్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్, నెస్లే ఇండియా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం తగ్గింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం పతనమైంది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం క్షీణించాయి. వేదాంత్ ఫ్యాషన్స్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఆస్ట్రల్, షాపర్స్ స్టాప్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఈకేఐ ఎనర్జీ, శివ సిమెంట్, పీఎన్‌బీ గిల్ట్స్ తదితర 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల కనిష్ఠానికి పడిపోయాయి.






# రేపటి కోసం ప్లాన్ ఎలా?

## ఎన్‌పీఎస్ వివరాలు తెలుసా..

రిటైర్మెంట్‌తో మీకు అందే ఆదాయానికి తెర పడ్డట్టే. రోజువారీ అవసరాలకు కూడా నానా ఇబ్బందులు తలెత్తుతాయంటే అతిశయోక్తి కాదు. ఇలాంటప్పుడే ప్లానింగ్ విలువ తెలిసేది. రిటైర్మెంట్ కోసం చక్కని ప్రణాళికల్ని వేసుకొనే వారికి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ప్రధానమని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వచ్ఛంధ పథకం విషయానికొస్తే..

**టైర్ 1 అకౌంట్**

రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం టైర్ 1 అకౌంట్ ప్రధానం. పూర్తిస్థాయిలో ఎన్‌పీఎస్, పన్ను ప్రయోజనాలను అందుకోవాలంటే ఇది అవసరం.

**కనీస విరాళాలు**

కనీస ప్రారంభ విరాళం రూ.500. ఆ తర్వాత ప్రతీ ఆర్థిక సంవత్సరం కనీస విరాళం రూ.1,000.

**పన్ను ప్రయోజనాలు**

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీసీడీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను పొందవచ్చు. అదనంగా సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద మరో రూ.50వేలు క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ(2) కింద అదనపు కోతల ద్వారా కార్పొరేట్ ఉద్యోగులూ లాభం పొందవచ్చు.

**లాకిన్ పీరియడ్**

టైర్ 1 ఖాతాలో ఖాతాదారునికి 60 ఏండ్లు వచ్చే దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే 60 శాతం నిధిని పన్ను లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగతా 40 శాతం నిధిని రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ కోసం యాన్యుటీని కొనాల్సి ఉంటుంది.

**టైర్ 2 అకౌంట్**

ఇది వాలంటరీ సేవింగ్స్ అకౌంట్. దీనికి ఎలాంటి పన్ను ప్రయోజనాలు వర్తించవు. అయితే రిటైర్మెంట్‌కు ముందే ఫండ్స్‌ను విత్‌డ్రా చేసుకోవాలనుకొనేవారికి ఇది ఉపయోగకరం.

**కనీస విరాళాలు**

రూ.1,000. మీడియం టర్మ్ సేవింగ్స్, ఎమర్జెన్సీలకు మంచి అవకాశం. టైర్ 2 అకౌంట్‌ను తెరవాలంటే టైర్ 1 ఖాతాను తీసుకోవాలి. కాగా, టైర్ 1, 2 ఖాతాలు సింగిల్ పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్)కు లింకై ఉంటాయి.

# పన్ను తగ్గింపులు అడగొద్దు


## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రిక్వెస్ట్..!



పన్ను తగ్గింపులు కోరవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కార్ల పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వానికి డబ్బు అవసరమన్నారు. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9శాతానికి తగ్గుతుందన్నారు. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని.. పన్నులు తగ్గిస్తే.. మరింత డిమాండ్ చేస్తారన్నారు. ఇది మానవ మస్తత్వం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నామని.. కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకొని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని.. ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 1416 శాతంగా ఉందని.. రాబోయే రెండేళ్లలోపు లాజిస్టిక్స్ ఖర్చు 9శాతానికి తగ్గుతుందని హామీ ఇచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పోటీతత్వాన్ని కలిగి ఉంటామన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా.. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతం ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

# ప్రపంచ వ్యాప్తంగా నిలిచిన ఎక్స్ సేవలు

## సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యూజర్లు




అమెరికన్ టైకూన్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఆధీనంలోని ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ (ఎక్స్) ఇటీవలే మాటిమాటికీ సతాయిస్తోంది. ఏదో ఒక సమస్యతో యూజర్లను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవలే ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడటం.. లాగిన్ కాకపోవడం, ట్వీట్స్ మాయం కావడం వంటి సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఎక్స్‌లో ఇలాంటి సమస్యే తలెత్తింది. సోమవారం మధ్యాహ్నం ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. సైట్ ఓపెన్ కావడం లేదు. లాగిన్ అయినా యాక్సిస్ చేయలేక యూజర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వరుసగా పోస్టులు పెడుతున్నారు. దాదాపు అరగంట నుంచి ఎక్స్ సేవలు స్తంభించిపోయినట్లు పేర్కొంటున్నారు. ఎక్స్ సైట్‌ను ఓపెన్ చేయగా.. స్క్రీన్‌పై 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్.. ప్లీజ్ ట్రై అగెయిన్' అన్న సందేశం వస్తున్నట్లు తెలిపారు. డౌన్‌డిటెక్టర్ నివేదిక ప్రకారం.. భారత్‌లో 2 వేల మంది, అమెరికాలో 18,000, యూకేలో 10,000 మంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఎక్స్ అంతరాయానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. చాలా మంది వినియోగదారులు సర్వర్ డౌన్ అయినట్లు ఫిర్యాదు చేశారు. ఈ అంతరాయం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు ఒకింత గందరగోళానికి గురయ్యారు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL





# టాయిలెట్లు నిరూపయోగం

## వెనక్కి మళ్లిన ఎయిర్ ఇండియా విమానం

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియా విమానంలోని టాయిలెట్లు అసౌకర్యంగా మారాయి. పాలిథిన్ బ్యాగులు, డైపర్లు, గుడ్డలు అడ్డుపడటంతో మూసుకుపోయాయి. అపరిశుభ్రత వల్ల చాలా టాయిలెట్లను వినియోగించలేని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా విమానాన్ని వెనక్కి మళ్లించాల్సి వచ్చింది. మార్చి 5న అమెరికాలోని చికాగో ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయ్యింది. కాగా, ఆ విమానంలోని 12 టాయిలెట్లలో 8కిపైగా వినియోగానికి వీలు లేకుండా అసౌకర్యంగా మారాయి. పాలిథిన్ బ్యాగులు, డైపర్లు, గుడ్డలు అడ్డుపడటంతో టాయిలెట్లు మూసుకుపోయాయి. దీంతో సుమారు గంటన్నర ప్రయాణం తర్వాత ఆ విమానాన్ని తిరిగి చికాగో ఎయిర్‌పోర్ట్‌కు మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు ఈ అంశంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా వివరణ ఇచ్చింది. పాలిథిన్ బ్యాగులు, డైపర్లు, గుడ్డలు వంటివి అడ్డుపడటంతో విమానంలోని 12 టాయిలెట్లలో 8 నిరూపయోగంగా మారినట్లు తెలిపింది. 'ఆ సమయానికి విమానం అట్లాంటిక్ మీదుగా ఎగురుతోంది. యూరప్‌లోని కొన్ని ప్రాంతాలకు మళ్లించడానికి అవకాశం లేదు. చాలా యూరోపియన్ విమానాశ్రయాల్లో రాత్రి కార్యకలాపాలపై ఆంక్షలున్నాయి. దీంతో విమానాన్ని తిరిగి చికాగోకు మళ్లించాలని నిర్ణయించాం' అని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులు ఎదుర్కొన్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు వెల్లడించింది.

# జర్మనీ ఎయిర్‌పోర్టుల్లో సిబ్బంది సమ్మె

## వేల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దు..!



జర్మనీ ఎయిర్‌పోర్టుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఒకరోజు సమ్మె కు పిలుపునిచ్చారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు కలిసికట్టుగా సమ్మెకు దిగడంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్ సహా జర్మనీలోని అన్ని ప్రధాన నగరాల్లోగల విమానాశ్రయాల్లో విమాన సర్వీసుల పై ప్రభావం పడింది. వేల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. దాంతో దేశవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి 1,116 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా అందులో 1,054 విమాన సర్వీసులు రద్దయినట్లు స్థానిక మీడియా తెలిపింది. బెర్లిన్ నుంచి నడిచే విమానాలన్నీ రద్దయినట్లు వెల్లడించింది. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. పలు విమాన సర్వీసులు రద్దయినట్లు కొలోన్ ఎయిర్‌పోర్టు ప్రకటించింది. సమ్మె కారణంగా విమాన సర్వీసుల సంఖ్య భారీగా తగ్గిందని మ్యూనిచ్ విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ సమ్మె కారణంగా మొత్తం 3,400 విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. దాదాపు 5 లక్షల మందికిపైగా ప్రయాణికులపై సమ్మె ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. వేతనాలు పెంచాలని ఉద్యోగులు, పని ప్రదేశంలో షరతులు వద్దని, అదనపు సమయం పనిచేస్తే ఎక్కువ మొత్తంలో బోనస్ ఇవ్వాలని కోరుతూ ఇతర సిబ్బంది, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే వారి డిమాండ్లను పరిష్కరించలేమని ఆయా విమానాశ్రయాల యాజమాన్యాలు చేతులెత్తేశాయి. ఈ విషయంపై ఇటీవల విమానాశ్రయాల ఉద్యోగులు, ఇతర సిబ్బంది, కార్మికులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దాంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి. ఈ నెల ఆఖరులో విమానాశ్రయాల యాజమాన్యాలు సిబ్బందితో మరోసారి చర్చలు జరిపే అవకాశం ఉంది.




# 9 ఏండ్ల ట్రుడో పాలనకు తెర..

## కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ

**ఒట్టావా:** కెనడాలో తొమ్మిదేండ్ల జస్టిన్ ట్రుడో పాలనకు తెరపడింది. ఆ దేశ నూతన ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. జస్టిన్ ట్రుడో ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నట్లు గత జనవరిలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార లిబరల్ పార్టీ సారథి ఎన్నిక అనివార్యమైంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ 59 ఏండ్ల మార్క్ కార్నీ విజేతగా నిలిచారు. దీంతో దేశ 24వ ప్రధానిగా పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. ప్రధాని పదవికి కార్నీతోసహా నలుగురు పోటీపడ్డారు. లక్షా 50 వేల మంది పార్టీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో కార్నేకు 131,674 ఓట్లు వచ్చాయి. ఇవి మొత్తం ఓట్లలో 85.9తో సమానం. 11,134 ఓట్లతో క్రిస్టియా ఫ్రీలాండ్ రెండో స్థానంలో నిలిచారు. కరీనా గౌల్డ్‌కు 4,785 ఓట్లు, ఫ్రాంక్ బేలిస్‌కు 4,038 ఓట్లు పోలయ్యాయి. ఈ భారీ విజయంతో లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతలను కార్నీ త్వరలో చేపట్టనున్నారు. డొనాల్డ్ ట్రంప్ నుంచి సుంకాల ముప్పు ఎదుర్కొంటున్న వేళ.. ఆర్థిక రంగంలో అపారమైన అనుభవం ఉన్న కార్నీపై కెనడా ప్రజలు భారీ ఆశలు పెట్టుకున్నారు. కార్నీ పూర్తి పేరు మార్క్ జోసెఫ్ కార్నీ. ఆయన 1965 మార్చి 16న నార్త్‌వెస్ట్ టెరిటోరీస్‌లోని ఫోర్ట్ స్మిత్‌లో జన్మించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీని అందుకున్నారు. అనంతరం ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో మాస్టర్స్, డాక్టరేట్ డిగ్రీలను సాధించారు. 13 ఏండ్లపాటు గోల్డ్‌మన్ సాచ్స్‌లో పనిచేశారు. 2003లో బ్యాంక్ ఆఫ్ కెనడా డిప్యూటీ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 2004లో కెనడా ఫైనాన్స్ డిపార్ట్‌మెంటులో సీనియర్ అసోసియేట్ డిప్యూటీ మినిస్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2008 నుంచి 2013 వరకు కెనడా బ్యాంక్ 8వ గవర్నర్‌గా సేవలందించారు. ఆ సమయంలో ఆర్థిక సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి అవసరమైన చర్యలను సమన్వయపరచడంలో కీలకంగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు.

# న్యూయార్క్‌లో భీకర కార్చిచ్చు

## అత్యవసర పరిస్థితి విధింపు




**వాషింగ్టన్ :** న్యూయార్క్‌కు చెందిన లాంగ్ ఐలాండ్‌లోని అటవీ ప్రాంతంలో భారీ కార్చిచ్చు చెలరేగింది. దీంతో గవర్నర్ క్యాథీ హోచుల్ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ముఖ్యంగా లాంగ్ ఐలాండ్‌లో పలు చోట్ల చెలరేగిన కార్చిచ్చు శనివారం భీకర రూపం దాల్చింది. ఇక్కడి ఓ ప్రధాన జాతీయ రహదారిని అధికారులు మూసేయించారు. మిలటరీ బేస్‌ను ఖాళీ చేయించారు. అలాగేపైన్ బారెన్స్ ప్రాంతం చుట్టూ పలు చోట్ల మంటలు చెలరేగాయి. వేగంగా కదులుతున్న దావానలంతో ఇక్కడున్న ఓ రసాయన కర్మాగారం, అమెజాన్ వేర్‌హౌస్‌కు ప్రమాదం పొంచి ఉందని అధికారులు అంచనా వేశారు. రెండు వాణిజ్య సంస్థల భవనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లాంగ్ ఐలాండ్ అటవీ ప్రాంతంలో మంటల్ని ఆర్పేందుకు మొత్తం రాష్ట్ర యంత్రాంగం రంగంలోకి దిగింది.

# ముత్తువేల్ పాండియన్ వేట మొదలైంది

రజనీకాంత్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన జైలర్ 2023 సినిమా భారీ హిట్ అయింది. ఈ చిత్రానికి సీక్వెల్ వస్తుందని వార్తలు అయితే వస్తున్నాయి కానీ అధికారికంగా షూటింగ్ ఎప్పుడు ప్రారంభం అవుతుంది అనేది చెప్పలేదు. తాజాగా, ఈ అంశం గురించి సన్‌పిక్చర్స్ అప్‌డేట్ ఇచ్చేసింది. 'జైలర్ 2' సినిమా షూటింగ్ నేటి నుంచి ప్రారంభం అవుతుందని మేకర్స్ ప్రకటంచారు. ముత్తువేల్ పాండియన్ వేట ఇప్పుడే ప్రారంభమైంది అంటూ ఒక పోస్టర్‌ను పంచుకున్నారు. జైలర్ 2 షూటింగ్ ప్రారంభమైనట్లు మేకర్స్ ప్రకటించడంతో రజనీకాంత్ అభిమానులు వైరల్ చేస్తున్నారు. 'టైగర్ కా హుకుమ్' అంటూ పోస్టులు పెడుతున్నారు. 'జైలర్ 2' కథాంశం ప్రధానంగా గోవా నేపథ్యంలో ఉంటుందని కోలీవుడ్ సమాచారం. ఇకపోతే జైలర్ చిత్రంలో నటించిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ తదితర ప్రముఖ నటీనటులే నటించనున్నట్లు తెలుస్తోంది. సీక్వెల్‌లో కన్నడ భామ శ్రీనిధి శెట్టి నటించనున్నట్లు తెలిసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో జైలర్ 2 విడుదల చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నారు.





# ప్రభాస్ @ బక..
## ఇంతకీ దీని అర్థమేంటి?

ప్రభాస్ చేతిలో ఇప్పుడు బోలెడు సినిమాలున్నాయి. ప్రస్తుతానికైతే రాజాసాబ్, ఫౌజీ (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్టులు చేస్తున్నాడు. దీని తర్వాత సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చేస్తాడు. వీటితో పాటు సలార్ 2, కల్కి 2.. ఇలా చాలానే ఉన్నాయి. ఇవి సరిపోవంటూ ఈ మధ్యే 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మతోనూ ప్రభాస్ సినిమా ఒకటి ఓకే అయింది. దీని లుక్ టెస్ట్ కూడా అయిపోయిందని టాక్. ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పుడు కొత్త అప్డేట్ వచ్చింది. 'బక' అనే టైటిల్ ని ఫిక్స్ చేశారని టాక్. దీంతో డార్లింగ్ ఫ్యాన్స్ షాకవుతున్నారు. టైటిల్ చూడగానే మీకు కూడా విచిత్రంగా ధ్వనించి ఉంటుంది. అయితే మహాభారతంలోని బకాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడుగా. అతడి కథనే ఇప్పటి ట్రెండ్ కి తగ్గట్లు ప్రశాంత్ వర్మ రాశాడని, అందుకే సింపుల్ గా 'బక' అని పెట్టినట్లు తెలుస్తోంది. ఇది నిజమో కాదో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే. ఇప్పటివరకు వచ్చిన పౌరాణిక, మైథలాజికల్ సినిమాలతో పోలిస్తే ఈ మూవీ భిన్నంగా ఉంటుందని, పూర్తిగా విజువల్ ఎఫెక్ట్ బేస్డ్ చిత్రమని అంటున్నారు. అలానే ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగమైన సినిమా అని టాక్.

# నితిన్ రాబిన్‌హుడ్..
## అది దా సర్‌ప్రైజ్
## అంటోన్న కేతిక శర్మ



నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా యాక్షన్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్ రాబిన్‌హుడ్. 'భీష్మ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్ దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తోన్న ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్ ప్రమోషన్స్‌తో దూసుకెళ్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన మంచి రెస్పాన్స్ వస్తోంది.

తాజాగా ఈ మూవీ నుంచి మూడో లిరికల్ పాటను మేకర్స్ విడుదల చేశారు. 'అది దా సర్‌ప్రైజ్' అంటూ సాగే ఐటమ్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ స్పెషల్ సాంగ్‌లో హీరోయిన్ కేతిక శర్మ తన డ్యాన్స్‌తో అలరించింది. ముఖ్యంగా కేతిక శర్మ అందాలతో అభిమానులను తెగ ఆకట్టుకుంది. ఈ పాట రాబిన్‌హుడ్‌లో మూవీలో ప్రత్యేకమైన క్రేజ్ సొంతం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. అంతుకుముందే కేతిక శర్మ తెలుగులో రంగరంగ వైభవంగా, లక్ష్య లాంటి చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. కాగా.. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం జీవీ ప్రకాశ్‌కుమార్ అందించారు.

## ఇన్‌స్టా ఫేమ్ 'అమృత చౌదరి'కి
# ఫ్యాన్స్ ఫిదా



ఫ్రెజర్ కుక్కర్, లగ్గం వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు సాయి రోనక్.. ఆయన నటించిన తెలుగు సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ సినిమా రివైండ్ సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తూ సోషల్‌మీడియాలో గుర్తింపు తెచ్చుకున్న అమృత చౌదరి హీరోయిన్‌గా నటించింది. గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం నాలుగు నెలల తర్వాత మార్చి 10న ఓటీటీలో విడుదలైంది. తెలుగుతో పాటు హిందీ భాషలోనూ రివైంట్ చిత్రం అందుబాటులో ఉంది. సాయి రోనక్, అమృత చౌదరి కాంబినేషన్‌తో రివైండ్ చిత్రానికి మంచి మార్కులే పడ్డాయి. ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. ఇందులో సురేశ్, సామ్రాట్, వైవా రాఘవ్, జబర్దస్త్ నాగి, అభిషేక్ విశ్వకర్మ, ఫన్‌బకెట్ భరత్.. తదితరులు కీలక పాత్ర పోషించారు. కళ్యాణ్ చక్రవర్తి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించాడు. శివరామ్ చరణ్ సినిమాటోగ్రాఫీ అందించగా ఆశీర్వాద్ లూక్ సంగీతం సమకూర్చాడు. ఈ మూవీ 2024 అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

## కథేంటి..?

ఈ సినిమా కథ 2019-2024 మధ్య కాలంలో జరుగుతుంది. కార్తిక్(సాయి రోనక్) ఓ సాఫ్ట్‌వేర్. తన స్నేహితుడు సుబ్బు అపార్ట్‌మెంట్‌లో శాంతి(అమృత చౌదరి)ని చూసి తొలి చూపులోనే ప్రేమలో పడిపోతాడు. తను పని చేసే ఆఫీసులోనే ఆమె కూడా జాయిన్ అవ్వడంతో పరిచయం పెంచుకుంటాడు. ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడతారు కానీ బయటకు చెప్పకోరు. ఓ రోజు శాంతి ఓ ముఖ్యమైన విషయం చెప్పాలంటూ కార్తిని కాఫీ షాపుకు రమ్మని చెబుతుంది. అదే రోజు శాంతి వాళ్ల తాతయ్య(సామ్రాట్) కనిపెట్టిన టైం మిషన్ సహాయంతో కార్తిక్ టైమ్ ట్రావెల్ చేసి 2019 కాలం నాటికి వెళ్తాడు. ఆ తర్వాత కార్తిక్ జీవితంలో ఎలాంటి పరిణామాలు జరిగాయి? కార్తి టైమ్ ట్రావెల్ చేయాలని ఎందుకు అనుకున్నాడు? శాంతి వాళ్ల తాతయ్య కనిపెట్టిన టైమ్ మిషన్ కార్తికి ఇంటికి ఎలా చేరిది? కార్తిక్ ఫ్లాష్‌బ్యాక్ స్టోరీ ఎంటి? చివరకు శాంతి, కార్తిక్‌లు ఒకటయ్యారా? లేదా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



# క్రీడా వార్తలు | SPORTS NEWS



# ముగింపు వేడుకలో ఒక్క పాకిస్తాన్ ప్రతినిధి కూడా లేడు.. కారణం ఏంటి..?

20 రోజుల పాటు సాగిన ఛాంపియన్స్ ట్రోఫీ2025 భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన నిన్నటితో (మార్చి 9) ఫైనల్‌తో ముగిసింది. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచింది. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్లో టీమిండియా న్యూజిలాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి, మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. కాగా, నిన్నటి ఫైనల్ అనంతరం ప్రజెంటేషన్ సెర్మనీ సందర్భంగా పోడియంపై ఒక్క పాకిస్తాన్ ప్రతినిధి కూడా కనపడకపోవడం చర్చనీయాంశంగా మారింది. టోర్నీకి ఆతిథ్యమిచ్చిన పాకిస్తాన్ నుంచి పోడియంపై ఒక్క ప్రతినిధి కూడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ అంశాన్ని పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ సోషల్‌మీడియా వేదికగా లేవనెత్తాడు. టోర్నీకి ఆతిథ్యమిచ్చిన పాకిస్తాన్ నుంచి ఒక్క ప్రతినిధి కూడా లేకపోవడమేంటని ప్రశ్నించాడు. ఇలా జరగడం దురదృష్టకరమని అన్నాడు. వాస్తవానికి భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు టోర్నీ ఆతిథ్య దేశ హోదాలో పాకిస్తాన్ నుంచి ఒక్కరైనా హాజరు కావాల్సి ఉండింది. అయితే అలా జరగలేదు. ముగింపు వేడుకకు పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ రావాల్సి ఉన్నా రాలేదు. బదులుగా, పాకిస్తాన్ లెగ్ మ్యాచ్‌లు నిర్వహించిన టోర్నీ డైరెక్టర్



సుమైర్ అహ్మద్‌ను పంపారు. ప్రోటోకాల్ ప్రకారం ముగింపు వేడుకల్లో పోడియంపైకి బోర్డు ద్వారా ఎన్నికైన సభ్యులు లేదా డైరెక్టర్లను మాత్రమే అనుమతిస్తారు. సుమైర్ అహ్మద్ పీసీబీ ఉద్యోగి మాత్రమే కావడంతో అతన్ని పోడియంపైకి అనుమతించలేదు. దుబాయ్ లెగ్‌కు బాధ్యత వహించిన మరో టోర్నమెంట్ డైరెక్టర్ ఆండ్రీ రస్సెల్‌ను కూడా పోడియంపైకి పిలువలేదు. మొత్తంగా పాకిస్తాన్ ప్రతినిధి లేకుండానే ఛాంపియన్స్ ట్రోఫీ ముగింపు వేడుక ముగిసింది. ముగింపు వేడుకలో ఐసీసీ తరఫున ఛైర్మన్ జై షా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యూజిలాండ్ క్రికెట్ డైరెక్టర్ రోజర్ ట్వోస్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే, ఉత్కంఠగా సాగిన నిన్నటి ఫైనల్లో భారత్ న్యూజిలాండ్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేయగా.. భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో భారత స్పిన్నర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ ఓ మోస్తరు స్కోర్‌కే పరిమితమైంది. న్యూజిలాండ్ తరఫున డారిల్ మిచెల్ (63), మైఖేల్ బ్రేస్‌వెల్ (53 నాటౌట్) రాణించారు. రచిన్ రవీంద్ర (37), ఆఖర్లో గ్లెన్ ఫిలిప్స్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. విల్ యంగ్ (15), కేన్ విలియమ్సన్ (11), టామ్ లాథమ్ (14),మిచెల్ సాంట్నర్ (8) తక్కువ స్కోర్లకు ఔటయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ తలో 2.. షమీ, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో రోహిత్ (76) భారత్‌కు శుభారంభాన్ని అందించారు. శుభ్‌మన్ గిల్‌తో (31) కలిసి తొలి వికెట్‌కు 105 పరుగులు జోడించాడు. అయితే భారత్ 17 పరుగుల వ్యవధిలో గిల్, కోహ్లి (1), రోహిత్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో శ్రేయస్ అయ్యర్ (48), అక్షర్ పటేల్ (29) మంచి భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌ను తిరిగి గేమ్‌లోకి తెచ్చారు. అయితే శ్రేయస్, అక్షర్ కూడా స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో టీమిండియా మరోసారి కష్టాల్లో పడింది. అయితే కేఎల్ రాహుల్ (34 నాటౌట్).. హార్దిక్ పాండ్యా (18), రవీంద్ర జడేజాతో (18 నాటౌట్) కలిసి మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యాలు నెలకొల్పి భారత్‌ను విజయ తీరాలకు చేర్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో సాంట్నర్, బ్రేస్‌వెల్ తలో 2 వికెట్లు పడగొట్టగా.. జేమీసన్, రచిన్ చెరో వికెట్ దక్కించుకున్నారు.



# షమీ తల్లి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న కోహ్లీ

ఛాంపియన్స్ ట్రోఫీ2025 ఫైనల్లో టీమిండియా విజయానంతరం దుబాయ్ క్రికెట్ స్టేడియంలో పలు ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. టీమిండియా ఆటగాళ్ల విజయోత్సవ సంబురాలతో పాటు పలు దృష్యాలు సోషల్‌మీడియాను విపరీతంగా ఆకర్శించాయి. ఇందులో ఒకటి విరాట్ కోహ్లి.. సహచరుడు మహ్మద్ షమీ తల్లికి పాదాభివందనం చేయడం. విజయోత్సవ సంబురాల్లో భాగంగా టీమిండియా ఆటగాళ్లంతా కుటుంబ సభ్యులతో కలిసి స్టేడియంలో కలియతిరుగుతుండగా.. కోహ్లికి షమీ తల్లి తారసపడింది. కోహ్లి వెంటనే షమీ తల్లి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. అనంతరం షమీ కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగాడు. విరాట్ షమీ తల్లి పాదాలకు నమస్కరించిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతుంది. ఇది చూసి జనాలు విరాట్‌ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. విరాట్‌కు పెద్దలంటే ఎంత గౌరవమోనని చర్చించుకుంటున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ విజయానంతరం దుబాయ్ స్టేడియంలో ఇలాంటి ఫ్యామిలీ మూమెంట్స్ చాలా కనిపించాయి. శుభ్‌మన్ గిల్ తండ్రితో రిషబ్ పంత్ చిందులేయడం.. శ్రేయస్ తల్లి అతన్ని ముద్దాడటం.. ఇలా చాలా ఆసక్తికర ఫ్యామిలీ మూమెంట్స్‌కు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ వేదికైంది. ఇదిలా ఉంటే, నిన్నటి ఫైనల్లో భారత్ న్యూజిలాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. భారత్ ఆటగాళ్లలో విరాట్, రోహిత్, జడేజా మినహా దాదాపుగా అందరికీ ఇదే తొలి ఐసీసీ టైటిల్ కావడం విశేషం. చాలాకాలంగా టీమిండియాలో కీలక సభ్యుడిగా ఉన్నా షమీకి సైతం ఐదే తొలి ఐసీసీ టైటిల్. 2013 జనవరిలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన షమీ.. ఐసీసీ ఈవెంట్లలో టీమిండియా తరఫున ఎన్నో అత్యుత్తమ ప్రదర్శనలు చేసినా దీనికి ముందు ఒక్కసారి కూడా టైటిల్ విన్నింగ్ జట్టులో భాగం కాలేకపోయాడు. గతేడాది భారత్ టీ20 వరల్డ్‌కప్ గెలిచినప్పటికీ.. ఆ ఐసీసీ టోర్నీకి షమీ దూరంగా ఉన్నాడు. వన్డే వరల్డ్‌కప్2023 సందర్భంగా గాయపడిన షమీ.. తిరిగి ఛాంపియన్స్ ట్రోఫీ2025తోనే (ఐసీసీ టోర్నీలు) రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో షమీ 5 మ్యాచ్‌ల్లో 25.88 సగటున, 5.68 ఎకానమీ రేటుతో 9 వికెట్లు తీసి భారత్ అజేయ యాత్రతో తనవంతు పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో షమీ అత్యుత్తమ ప్రదర్శన బంగ్లాదేశ్‌పై వచ్చింది. ఆ మ్యాచ్‌లో షమీ ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై కూడా షమీ సత్తా చాటాడు. ఆ మ్యాచ్‌లో షమీ మూడు వికెట్లు పడగొట్టాడు. ఫైనల్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేయగా.. భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో భారత స్పిన్నర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ ఓ మోస్తరు స్కోర్‌కే పరిమితమైంది. న్యూజిలాండ్ తరఫున డారిల్ మిచెల్ (63), మైఖేల్ బ్రేస్‌వెల్ (53 నాటౌట్) రాణించారు. రచిన్ రవీంద్ర (37), ఆఖర్లో గ్లెన్ ఫిలిప్స్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. విల్ యంగ్ (15), కేన్ విలియమ్సన్ (11), టామ్ లాథమ్ (14),మిచెల్ సాంట్నర్ (8) తక్కువ స్కోర్లకు ఔటయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ తలో 2.. షమీ, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో రోహిత్ (76) భారత్‌కు శుభారంభాన్ని అందించారు. శుభ్‌మన్ గిల్‌తో (31) కలిసి తొలి వికెట్‌కు 105 పరుగులు జోడించాడు.

# ఎక్కడైనా టీమిండియాదే గెలుపు!.. ఇచ్చిపడేసిన పాకిస్తాన్ దిగ్గజ క్రికెటర్

టీమిండియాపై పాకిస్తాన్ దిగ్గజ క్రికెటర్ వసీం అక్రం ప్రశంసలు కురిపించాడు. వేదిక ఏదైనా రోహిత్ సేనకు తిరుగులేదని.. అద్భుత ప్రదర్శనతో విజయాలు సాధిస్తున్న తీరు అమోఘమని కొనియాడాడు. ఎల్లవేళలా తమ కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లకు సంపూర్ణ మద్దతు ప్రకటించి భారత క్రికెట్ నియంత్రణ మండలిఅనుకున్న ఫలితాన్ని రాబట్టగలిగిందని ప్రశంసించాడు. కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025లో భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ ఈ మెగా టోర్నీ నిర్వహణ హక్కులు దక్కించుకోగా.. టీమిండియా మాత్రం తటస్థ వేదికైన దుబాయ్‌లో తమ మ్యాచ్‌లు ఆడింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌లను ఓడించిన రోహిత్ సేన.. సెమీస్‌లో ఆస్ట్రేలియాను, ఫైనల్లో న్యూజిలాండ్‌లపై గెలిచి టైటిల్ సాధించింది.

**బీసీసీఐ అనుసరించిన విధానాల వలనే..**

అయితే, ఒకే వేదికపై ఆడటం భారత్‌కు సానుకూలంగా మారిందనే విమర్శల నేపథ్యంలో పాక్ దిగ్గజ ఫాస్ట్‌బౌలర్ వసీం అక్రం తనదైన శైలిలో స్పందించాడు. బీసీసీఐ అనుసరించిన విధానాలే టీమిండియా జైత్రయాత్రకు కారణమని పేర్కొన్నాడు. ఈ మేరకు.. "ప్రస్తుత భారత జట్టు ప్రపంచంలోని ఏ వేదికపై ఆడినా కచ్చితంగా గెలుస్తుంది.



**ఒక్క ఓటమి కూడా లేకుండా**

దుబాయ్‌లో ఆడినందుకు టీమిండియా లాభపడిందని చాలా మంది అంటున్నారు. కానీ పాకిస్తాన్‌లో ఆడినా రోహిత్ సేన టైటిల్ గెలిచేది. టీ20 ప్రపంచకప్2024 టోర్నీలో భారత జట్టు కూడా అన్ని టీమ్స్ మాదిరే వివిధ వేదికలకు ప్రయాణాలు చేసింది. మరి అజేయంగానే చాంపియన్‌గా నిలిచింది కదా! ఒక్క ఓటమి కూడా లేకుండా ట్రోఫీని ముద్దాడింది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు నిలకడకు ఇది నిదర్శనం. రోహిత్ శర్మ నాయకత్వ పటిమకు ఇదో కొలమానం. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టీమిండియా టెస్టు సిరీస్‌లో కనీవినీ ఎరుగని రీతిలో 30తో వైట్‌వాష్ అయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో.. పదేళ్ల తర్వాత తొలిసారి బోర్డర్ గావస్కర్ ట్రోఫీని చేజార్చుకుంది. అంతకు ముందు శ్రీలంకకు వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయింది. ఇలాంటి సమయాల్లో బోర్డుపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కెప్టెన్, కోచ్‌లను తొలగించాలనే డిమాండ్లు వస్తాయి. అయితే, బీసీసీఐ మాత్రం తమ సారథికి, శిక్షకుడికి అన్ని వేళలా పూర్తి మద్దతుగా నిలిచింది. అందుకు తగ్గ ఫలితాన్ని చాంపియన్స్ ట్రోఫీలో చాంపియన్‌గా నిలవడం ద్వారా పొందింది" అని వసీం అక్రం పేర్కొన్నాడు. కాగా చాంపియన్స్ ట్రోఫీ2025 ఫైనల్లో టీమిండియా కివీస్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించింది. తద్వారా మూడోసారి(2002, 2013, 2025) ఈ ఐసీసీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. దుబాయ్‌లో ఆదివారం రాత్రి ముగిసిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన భారత్ తొలుత బౌలింగ్ చేసింది. కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్(63), మైకేల్ బ్రాస్‌వెల్(40 బంతుల్లో 53 నాటౌట్) రాణించడం ద్వారా నిర్ణీత యాభై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# ఎల్ఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలి

- ఈ నెలాఖరు వరకే 25 శాతం రాయితీతో గడువు
- వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారాదా, పి. ప్రావీణ్య





**వరంగల్, మహా ;** రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్ లేఅవుట్ ప్లాట్ల యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి. ప్రావీణ్య లు అన్నారు. సోమవారం హనుమకొండ లోని కుడా కార్యాలయంలో వారు జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్ పై లేఅవుట్ డెవలపర్లు, సర్వేయర్లు, యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్న ఎల్ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించు కొనేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితితో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని అన్నారు. గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిలరుప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ల యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. తిరస్కరణకు గురి అయితే చెల్లించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్. ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు. జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పాత ప్లాట్ల కు సంబంధించి ఎల్ ఆర్ ఎస్ కట్టాలనుకుంటే రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత సమాచారం కార్పొరేషన్ కు చేరుతుందని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎల్ ఆర్ ఎస్ కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే బల్దియా అధికారుల దృష్టికి తీసుకువస్తే సహకరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవడం పై డెవలపర్లు, ప్లాట్ల యజమానులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్లు, కమిషనర్ నివృతి చేశారు. ఈ సమావేశంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్,జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులతో పాటు లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు డెవలపర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్

- నేరాల కట్టడిలో జిల్లాకు మంచి పేరు తెచ్చేలా కృషి చేస్తానన్న అధికారి
- కొత్త ఆలోచనలు,విధానాలతో కార్యచరణ
- పోలీసులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రయత్నం
- శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి



**ఆదిలాబాద్ మహా :** శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా పని చేస్తానని నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.సోమవారం స్థానిక జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.మొదటగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, ప్రస్తుత కరీంనగర్ సిపి క్రితం ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం వద్ద నుండి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేస్తామని తెలియజేశారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా క్రిమినల్ యాక్టివిటీస్ లేకుండా నేరాలను నియంత్రించడం, శాంతి భద్రతల పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా డ్యూటీ చేస్తానన్నారు. జిల్లాలో గంజాయి ,మాదకద్రవ్యాల పై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. రౌడీలు గ్యాంగ్ స్టర్లు లేకుండా హిస్టరీ షీట్లను ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని పర్యవేక్షిస్తూ నియంత్రిస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తో పాటు జిల్లాలో ఎలాంటి సంఘ విద్రోహశక్తుల సమస్యలు తలెత్తకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తామని తెలిపారు. అందరి సహకారంతో ఆదిలాబాద్ జిల్లా నేరాల కట్టడి లో ఉన్నత స్థానానికి ఎదిగేలా కృషి చేద్దమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, హసీబుల్లా, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులున్నారు.

# కలెక్టరేట్ ముందు రైతు ఆత్మహత్యాయత్నం

- అధికారుల తీరుతో మనస్థాపం చెందిన రైతు
- రైతులకు హామీ ఇచ్చేవరకు రోడ్డు వేయకూడదు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కలెక్టరేట్ కార్యాలయం ముందు రావిరాలకు చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, రావిరాల (కొంగర ఖుర్దు) గ్రామానికి చెందిన అనే రైతు సర్వే నెంబరు 13లో గల పట్టా భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయమన్న ఫోర్త్ సిటీ ఏర్పాటు కోసం హైదరాబాదు నుండి కొత్త నగరానికి చేరుకోవడానికి, పలు రోడ్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డు నుండి మీర్ ఖాన్ పేటలో నిర్మించబోయే ఫోర్త్ సిటీకి 300 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయాలని నిర్ణయించింది. దీంతో రావిరాల గ్రామానికి చెందిన రైతుల భూమికి ఎలాంటి హామీలు ఇవ్వకుండా, రైతుల అనుమతి లేకుండా వ్యవసాయ భూములలో ఉన్న పంటలను నాశనం చేస్తూ రోడ్డు పనుల కోసం సర్వే చేపడుతున్నారు. మేము అక్కడికి పోయి అడిగితే మమ్మల్ని, మా పొలాల్లో నుండి బయటకి పంపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. దీంతో కష్టపడి వేసిన పంట చేతికి రాకుండా నష్టం జరిగిందని రైతులు వాపోయారు. దీనికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు మూర్ఖంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. అధికారుల తీరుతో మనస్థాపం చెందిన రావిరాలకు చెందిన రైతు మా భూమిలో నుంచి రోడ్డు వేయరాదు అని పలుమార్లు అధికారులను కలిసిన ప్రయోజనం లేకపోవడంతో, సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం గేటు ముందు, పెట్రోల్ పోసుకొని ఆత్మహర్పణం చేసుకోవడానికి ప్రయత్నించాడు, అది గమనించిన పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రాణాపాయం జరగకుండా కాపాడారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



**ములుగు, మహా :** ములుగులోని ఎంఈవో కార్యాలయంలో అలింకో సమగ్ర శిక్షా వారి సౌజన్యంతో దివ్యాంగులకు ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. సోమవారం కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు, రోలాటర్, టీఎల్ఎం కిట్లను లబ్ధిదారులకు అందించారు. ఎంఈవో శ్రీనివాస్, ఐఈ కోఆర్డినేటర్ గుల్లపెల్లి సాంబయ్యలు మాట్లాడుతూ.. అవసరమైన ఉపకరణాలను తీసుకొని సక్రమంగా వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ దివ్యాంగ బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న ఐఈ ఆర్పీలను సంప్రదించాలన్నారు. ప్రతీ ఏడాది సమగ్ర శిక్షా ద్వారా భవిత పాఠశాలకు వచ్చే దివ్యాంగులకు రవాణా భత్యం, ఇతర పాఠశాలల్లో చదివే దివ్యాంగ పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్, స్కాలర్ షిప్స్ అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి భవిత పాఠశాలలో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ క్యాంపులను నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్స్ అర్షం రాజు, ఎస్.శ్రీనివాస్ రెడ్డి, అలింకో ప్రతినిధి ప్రీతి, ఆడియాలజిస్ట్ రతన్ సింగ్, ఐఈఆర్పీలు, దివ్యాగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని భూమి పూజ



**హనుమకొండ, మహా :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో డివిజన్ల వారీగా ప్రజలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలలో అధికారులు జాప్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున నియోజకవర్గ పరిధిలోని 58 వ డివిజన్ ఎన్జీఓఎస్ కాలనీ, రాఘవేంద్ర కాలనీలలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రజలు సహకరించాలని కోరారు.కాలనీలో పర్యటిస్తున్న క్రమంలో విద్యుత్తు సమస్య, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు ఎమ్మెల్యే నాయిని.నిత్యం ప్రజల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధిలో భాగంగా వరంగల్ నగరంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని నిధుల కేటాయింపు విషయంలో ఆయన కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే 183 కోట్ల నిధులను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కేటాయించారని తెలిపారు.ప్రధాన సమస్యలను ఏ బి సి విభాగాలుగా విభజించి పనులు చేపట్టామని వివరించారు.పార్టీలకు అతీతంగా నాకు ఓటువేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయడం నా బాధ్యత అని తెలిపారు.గత పాలకులు పార్టీల పరంగా నిధులను కేటాయించి వివక్ష చూపారని విమర్శించారు.ఈ ఐదేళ్ల కాలంలో పార్టీలు చూడమని,సమస్యలు ప్రతి అసమానతలు లేకుండా చేస్తానని అన్నారు.కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ,విద్యుత్తు సరఫరా వంటి సమస్యల పట్ల అధికారులు దృష్టి సారించాలన్నారు.

# రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటిల్లో ములుగు క్రీడాకారుల ప్రతిభ



**ములుగు, మహా :** కేలో ఇండియాలో భాగంగా ఆదివారం హైదరాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ములుగు జిల్లా తరఫున 24మంది విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్, డీవైఎస్వో తుల రవి తెలిపారు. సోమవారం జిల్లా క్రీడల కార్యాల యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడానైపుణ్యాలను పెంచుకొని కోచ్ ఇచ్చే శిక్షణను తీసుకుంటూ మరిన్ని పతకాలను సాధించాలని సూచించారు. క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని ఆకాంక్షించారు. సైక్లింగ్ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామని వెల్లడించారు. కాగా, ఇచ్చిన మాట ప్రకారంగా క్రీడాకారులకు సైక్లింగ్ లో ఉపయోగించే సైకిల్ ను అందించనున్నట్లు బాదం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, సైక్లింగ్ కోచ్ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ 10వ శాఖ ప్రారంభం



**హన్మకొండ, మహా :** హనుకొండ నగరం వడ్డేపల్లి లోని ప్రశాంత్ నగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ 10వ శాఖ సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామికగా నిలుస్తున్నది.1994 లో ఆవిర్భవించిన ఈ బ్యాంకు ఇప్పటి వరకు 400 కోట్లు టర్నోవర్ పూర్తి చేసుకోవడం స్ఫూర్తిదాయాకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్ హనుమకొండ జిల్లా డిసిఓ సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా డిసిఓఎం నీరజ, జగన్మోహన్ రావు బ్యాంకు డైరెక్టర్లు తోట సంపత్, ముందడ వేణుగోపాల్, పాపి రెడ్డి, కూరపాటి చంద్రమౌళి, గౌసుద్దీన్, పవన్, మందా స్వప్న శ్రీనివాస్, ఫౌండర్ డైరెక్టర్ ముత్తిలింగం పాలారం కృష్ణమూర్తి బ్యాంకు సిఈఓ సత్యనారాయణ రావు, బ్యాంకు సిబ్బంది తోపాటు ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి




**హుజూర్ నగర్, మహా:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని హోలీ క్రాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మాడుగుల ఉదయ్ కుమార్ అన్నారు. హుజూర్ నగర్ మండలం లింగగిరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల సూర్యాపేటలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా యోగా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన సి హెచ్ ఓ పద్మను శాలువా, మెమెంటోతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి సమాజం లో ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయ, పారిశ్రామిక రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ ప్రతిభ చాటుతున్నారని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకుని అనుచరిస్తున్నాయని, యోగాతో మానసిక, శారీరక వికాసం కలుగుతుందని పేర్కొన్నారు. పీహెచ్ సీ వైద్యుడు డాక్టర్ యశ్వంత్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని, తల్లి, చెల్లి, భార్య, స్నేహితురాలు ఇలా అన్ని బాధ్యతలు మోస్తూ సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ. పద్మ, పీహెచ్ఎన్ఓ. నూర్జహాన్ బేగం, సూపర్ వైజర్ పద్మ,ఇందిరాల రామకృష్ణ, రత్న మేరి, యరగాని శివ, జి.రమేష్, ప్రియాంక విజయ శ్రీ, ఝాన్సీ, ఆశా కార్యకర్తలు, హోలీ క్రాస్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు గుండు ఉపేందర్, చిడిపి పుష్పరాజ్, ఎం. వెంకటయ్య, వినోదరావు పాల్గొన్నారు.

# ఇది రైతు ప్రభుత్వం

## -ఏయంసీ చైర్మన్



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన కొన సాగుతుందని ఆదిలాబాద్ జిల్లా బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. బోథ్ మార్కెట్ కమిటీ కార్యాలయం లో మూడు నెలలకు ఒకసారి జరిగే సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రైతుల సౌకర్యార్థం, మార్కెట్ ఆదాయవనరులు పెంచడం కోసం దాదాపు 3 కోట్ల 82 లక్షల రూపాయలతో పనులు చేయడానికి నిర్ణయించుకొని ప్రపోజల్ పెట్టారు. అలాగే బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణం సక్రమంగా నిర్మించాలని, వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానం చేశారు.ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ ఆడే వసంత్, సెక్రటరీ విట్టల్, డైరెక్టర్ లు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి



**కరీంనగర్, మహా:** ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజవాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ (రెవెన్యూ), జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పవన్ కుమార్, డీఆర్ఓ బి.వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మహేశ్వర్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 226 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 34 దరఖాస్తులు, కరీంనగర్ ఆర్డిఓ కార్యాలయానికి 16, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి 14 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలను తప్పనిసరిగా చెల్లించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యం చేరుకోకుంటే ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధుల విషయంలో ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల నుంచి నెలాఖరులోగా చెల్లించాలని ఆదేశించారు.

**ఈజీఎస్ పనులు, ఎస్డీఎఫ్ పనులు పూర్తి చేయాలి..** జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఈజీఎస్ పనులు , ఎస్డీఎఫ్ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు ప్రహరీ పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు.ఎస్డీఎఫ్ పనుల గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. ఆర్అండ్ బీ,పంచాయతీరాజ్, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించేందుకు టోకెన్ నెంబర్ జనరేట్ చేయాలన్నారు. గ్రౌండింగ్ అయిన వాటికి ప్రోగ్రెస్ రిపోర్ట్, ప్రోగ్రెస్ అయిన వాటికి ఎంబీ రికార్డులు అవుతుండాలన్నారు. మండలాల్లో ఎంపీడీవోలు, మునిసిపాలిటీల్లో కమిషనర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ.. పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను యుద్ధ ప్రతిపదికన పూర్తి చేసుకోవాలన్నారు.